# ప్రజాశక్తి

శుక్రవారం 15 ఆగస్టు 2025 8 పేజీలు





గుంటూరు పల్నాడు






# పైరును ముంచిన నీరు

## ప్రాథమిక దశలోనే ముంపు బెడద - వాగుల ఉధృతి తగ్గినా వెంటాడుతున్న ముప్పు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం కురుస్తున్న వర్షాలతో గుంటూరు, పల్నాడు జిల్లాల్లో పలు ప్రాంతాల్లో పైర్లు ఇప్పటికీ జలదిగ్భంధనంలోనే ఉన్నాయి. గురువారం వర్షాలు తగ్గుముఖం పట్టగా శుక్రవారం కురిసే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. వివిధ మండలాల్లో మంగళవారం రాత్రి నుంచి బుధవారం రాత్రి వరకు కురిసిన అతి భారీ వర్షాలతో వాగులు పొంగి పొలాలను ముంచేత్తాయి. కృష్ణానదీ పరివాహక ప్రాంతంలో దాచేపల్లి నుంచి కొల్లిపర వరకు దాదాపు 30 వేల ఎకరాల్లో పైర్లు నీట మునిగాయి. ప్రధానంగా పత్తి, వరి, అపరాలు, మొక్కజొన్న, పసుపు పైర్లు ప్రాథమిక దశలోనే నీట మునగడంతో రైతులకు అపార నష్టం ఏర్పడింది. పెదకాకాని, మంగళగిరి, తాడేపల్లి, గుంటూరు తూర్పు తదితర మండలాల్లో పొలాల్లో నీరు ఇంకా తొలగలేదు. ప్రధానంగా కొండవీటి వాగు ప్రభావంతో మేడికొండూరు, ఫిరంగిపురం, తాడికొండ, తుళ్లూరు, మంగళగిరి మండలాల్లో దాదాపు 20 వేల ఎకరాల్లో నీరు చేరింది. వీటిల్లో దాదాపు ఆరు వేల ఎకరాల్లో పైర్లు నీట మునిగాయి.



తాడేపల్లి మండలం ఇప్పటంలో చెరువును తలపిస్తున్న వరి పొలం



తాడేపల్లి మండలం కుంచనపల్లిలో కరివేపాకు తోటలో నిలిచిన వర్షపు నీటిని ఆయిల్ ఇంజన్ సహాయంతో బయటకు తోడుతున్న రైతు మిరియాల కృష్ణ

వాగుల ఉధృతి తగ్గడం వల్ల రాజధానికి గురువారం రాకపోకలు పునరుద్ధరించారు. తాడికొండ మండలం లాం చప్టా వద్ద కొండవీటి వాగు, పెదపరిమి వద్ద కోటేళ్ల వాగు ఉధృతి తగ్గింది. ప్రకాశం బ్యారేజీకి వరద పోటు పెరిగింది. ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో గురువారం సాయంత్రం 5.59 లక్షల క్యూసెక్కుల వరద నీరు రాగా వచ్చిన నీటిని వచ్చినట్టు దిగువకు విడుదల చేస్తున్నారు. గురువారం వర్షం తగ్గడం, సాగర్, పులిచింతల నుంచి కూడా వరద ఉధృతి తగ్గడంతో శుక్రవారం కల్లా ప్రకాశం బ్యారేజికి ఉధృతి తగ్గుతుందని అధికారులు

▶ 2లో

## ఎకరాకు రూ.10 వేల పరిహారమివ్వాలి

- పొలాలను పరిశీలించిన రైతు, కౌలురైతు సంఘాలు డిమాండ్
- ఇప్పటికే రెండుసార్లు నాటామని కౌలురైతుల ఆవేదన

ప్రజాశక్తి - కొల్లిపర

ముంపు బారిన పడిన పొలాలను వెంటనే అంచనా వేసి నష్టపోయిన ప్రతి ఎకరాకూ రూ.10 వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని, దీంతోపాటు మళ్లీ సాగుకు విత్తనాలను ఇవ్వాలని రైతు, కౌలురైతు సంఘాలు డిమాండ్ చేశాయి. వీటిని భూ యజమానితో సంబంధం లేకుండా బాధిత కౌల్దార్లకే ఇవ్వాలని నాయకులు కోరారు. భారీ వానల నేపథ్యంలో మండలంలోని అత్తోట, దంతులూరు, చివలూరు తదితర గ్రామాల్లో పైర్లు ముంపుబారిన పడగా వాటిని రైతు, కౌలురైతు సంఘాల నాయకులు గురువారం పరిశీలించి కౌల్దార్లతో మాట్లాడారు. ఇప్పటికే రెండుసార్లు వెద పెట్టామని, ఎకరాకు రూ.12 వేలకుపైగా ఖర్చు చేశామని, నీరు త్వరగా పోకపోతే మళ్లీ నాటాల్సి ఉంటుందని కౌల్దార్లు వివరించారు. కౌలు కింద రూ.35 వేలు ఇచ్చామని, అయితే సిసిఆర్‌సి కార్డులు మాత్రం రాలేదని, రాయితీలు, నష్టపరిహారాలు కూడా దక్కడం లేదని చెప్పారు. ఈ సందర్భంగా కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు మాట్లాడుతూ మునిగిన పొలాలను వ్యవసాయ, రెవెన్యూ శాఖలు యుద్ధ ప్రాతిపదికన నమోదు చేయాలన్నారు. పొలాల్లో అనేక చోట్ల ఆయిల్ ఇంజిన్లు, మోటర్లు మునిగిపోయాయని, వాటికీ నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పొలాల్లోని నీటిని బయటకు పంపించడానికి సత్వర చర్యలు చేపట్టాలన్నారు. పంట కాల్వల్లో నీటి ప్రవాహానికి తూటుకాడ, గుర్రపు డెక్క అడ్డుగా ఉన్నాయని, వెంటనే తొలగించాలని కోరారు. రైతుసంఘం జిల్లా నాయకులు ఎం.శివసాంబిరెడ్డి మాట్లాడుతూ రెండేళ్ల నుండి వానలు, వరదల వల్ల సాగుదార్లు నష్టపోతున్నారని, వారిని అదుకునేందుకు స్థానిక మంత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. పరిశీలనలో అత్తోట సర్పంచ్ దేశీబోయిన నాగపూర్ణేశ్వరరావు, అలా నాగరాజు, ఉదారపు రామయ్య, వెంకట కోటేశ్వరరావు, నగుళ్ల హరిప్రసాద్, టి.నాగేశ్వరరావు, దేశిబోయిన శ్రీనివాసరావు, టి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## భూగర్భజలం 2.26 మీటర్లు వృద్ధి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది పల్నాడు జిల్లాలో సగటున 2.26 మీటర్ల మేరకు భూగర్భ జల నీటి మట్టం పెరిగిందని సిఎం చంద్రబాబుకు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. భూగర్భ జలం 30 మీటర్ల అడుగున ఉండే బొల్లాపల్లి మండలం, వెల్దుర్తి మండలాల్లో సైతం వరసగా 6 మీటర్లు, 3 మీటర్లు పెరిగిందని తెలిపారు. సాగునీటి సంఘ సభ్యులతో సిఎం గురువారం మధ్యాహ్నం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమావేశమయ్యారు. నరసరావుపేటలోని పల్నాడు కలెక్టరేట్ నుండి సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పెద్ద ఎత్తున చేపడుతున్న ఫాం పాండ్ల నిర్మాణాల వల్ల వచ్చే ఏడాది సైతం భూగర్భ జల మట్టం పెరిగే అవకాశం ఉందన్నారు. సమగ్ర నీటి నిర్వహణలో సాగునీటి సంఘ సభ్యులను, రైతులను భాగస్వాములను చేస్తామని చెప్పారు. 15 రోజుల్లో అన్ని ప్రాజెక్టులకు రిపేర్లు, కాల్వల్లో పూడిక తీత పనులు పూర్తి కావాలని సిఎం ఆదేశించారు. భూగర్భ జల మట్టం 20 మీటర్లు, 10 మీటర్ల దిగువన ప్రాంతాల్లో జల మట్టం పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళిక తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో నాగార్జున సాగర్ ప్రాజెక్టు కమిటీ చైర్ పర్సన్ కాంతారావు, చీఫ్ ఇంజినీర్ బి.శ్యామ్‌ప్రసాద్, ఎస్‌ఇ కృష్ణమోహన్, సాగునీటి సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న నీటి విడుదల

2 లో

## ఆర్‌పిఎఫ్ అధికారికి ప్రెసిడెన్షియల్ మెడల్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



గుంటూరు రైల్వే డివిజన్ ఆర్‌పిఎఫ్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ గోళ్లమూడి మధుసూదనరావుకు ప్రెసిడెన్షియల్ మెడల్ లభించింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రకటించిన అవార్డుల జాబితాలో మధుసూదనరావు పేరును కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా రైల్వే ప్రొటెక్షన్ ఫోర్సులో చేరిన మధుసూదనరావు ప్రమోషన్లు పొందుతూ వివిధ హోదాల్లో పనిచేశారు. ప్రస్తుతం డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్‌గా కొనసాగుతున్నారు. ప్రసిడెంట్ మెడల్ సాధించిన ఆయన్ను రైల్వే సౌత్ సెంట్రల్ జనరల్ మేనేజరు సంజయ్‌కుమార శ్రీ వాస్తవ, డిఆర్‌ఎం సుదేషన్ సేన్, పలువురు అధికారులు అభినందించారు.


మాట్లాడుతున్న డాక్టర్ కె.జగన్మోహన్ రెడ్డి

## నేడు కొండవీడు ఇఎన్‌టి హాస్పిటల్ ఉచిత వైద్యశిబిరం

### అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు, 30 శాతం రాయితీతో వినికిడి యంత్రాలు

**ప్రజాశక్తి-పల్నాడు జిల్లా**

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తమ హాస్పిటల్‌లో శుక్రవారం ముక్కు, చెవి, గొంతు వ్యాధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కొండవీడు ఇఎన్‌టి హాస్పిటల్ అధినేత డాక్టర్ కంజుల జగన్మోహన్‌రెడ్డి అన్నారు. నరసరావుపేటలోని హాస్పిటల్‌లో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ హాస్పిటల్ స్థాపించిన 26 ఏళ్ల నుండి జాతీయ పర్వదినాలైన స్వాతంత్ర్య దినోత్సవం, గాంధీ జయంతి, గణతంత్ర దినోత్సవాల సందర్భంగా ఏడాదికి మూడు పర్యాయాలు ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. తాజా వైద్య శిబిరంలో ముక్కు, చెవి, గొంతు వ్యాధులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని తెలిపారు. ఆపరేషన్లు అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని, 30 శాతం రాయితీపై వినికిడి యంత్రాలు ఇస్తామని అన్నారు.

## పులివెందుల గెలుపు ప్రజాస్వామ్య గెలుపు : శ్రీధర్

**ప్రజాశక్తి-పల్నాడు జిల్లా :** పులివెందులలో 30 ఏళ్ల తర్వాత ప్రజాస్వామ్యం గెలిచిందని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కడప జిల్లా ప్రజలు పులివెందుల, ఒంటిమిట్టలో టిడిపిని భారీ మెజారిటీతో గెలిపించడమే కాకుండా, ప్రజా స్వామ్యబద్ధంగా జరిగే ఏ ఎన్నిక ఫలితమైనా ఇలానే ఉంటుందని కడప ప్రజలు నిరూపించారని పేర్కొన్నారు. వైఎస్ కుటుంబ అరాచకాలు, హింసకు కడప జిల్లా ప్రజలు చరమగీతం పాడారని, భవిష్యత్తులో ప్రజా స్వామ్యబద్ధంగా ఏ ఎన్నిక జరిగినా టిడిపి విజయం సాధిస్తుందని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా కనీసం నామినేషన్ కూడా వేయనీకుండా వైఎస్ కుటుంబీకులు అప్రజాస్వామీకంగా గెలుపొందుతూ వచ్చారని, కూటమి పారదర్శకపాలన నేపథ్యంలో వైసిపి డిపాజిట్ గల్లంతయిందని పేర్కొన్నారు.

## విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు బహూకరణ

**ప్రజాశక్తి - విజయపురిసౌత్ :** స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా మాచర్ల మండలం పశువేముల గ్రామంలోని ఎంపిపి పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులను గురువారం పంపిణీ చేశారు. వీటిని రూ.5 వేలతో హైదరాబాద్‌కు చెందిన నవరాజ్ సమకూర్చి హెచ్‌ఎం వసంతకుమారికి అందచేశారు.

## పైరును ముంచిన నీరు

(మొదటి పేజీ తరువాయి)

అంచనా వేస్తున్నారు. అయితే ప్రకాశం బ్యారేజి ఎగువ దాచేపల్లి, అచ్చంపేట, అమరావతి, తుళ్లూరు, తాడేపల్లి, దిగువన తెనాలి, కొల్లిపర మండలాల్లోని కృష్ణా పరివాహక ప్రాంతంలోని గ్రామాల్లో వరదనీరు ప్రవేశించి పైర్లు నీట మునిగాయి. మంగళగిరి మండలంలో వరద ఉధృతి కొనసాగింది. నీరుకొండ వద్ద కొండవీటి వాగు బెడద కొనసాగుతోంది. నీరుకొండ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీకి వెళ్లేందుకు ఆటంకాలు ఏర్పడ్డాయి. రాజధాని గ్రామాల్లో వరద నీరు చేరింది. నీరుకొండ కురగల్లు బేతపూడి గ్రామాల్లో వరదనీటి ప్రవాహం ఉంది. ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ చుట్టూ, అమత యూనివర్సిటీ చుట్టూ వరద నీరు చేరింది. మంగళగిరి రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో వర్షం నీరు చేరి ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. పల్నాడు జిల్లాలోని పులిచింతల ఎగువ గ్రామాల్లో కూడా పొలాల్లో నీరు కొనసాగుతోంది. పల్నాడు జిల్లాల్లో కేవలం ప్రత్తి సాగుకు చేసిన పొలాలు కొంత వరకు నీట మునిగాయి. అయితే బుధవారం ఉన్న ముంపు ఉధృతి కొంత మేరకు తగ్గింది.

# కొనసాగుతున్న నీటి విడుదల





**ప్రజాశక్తి - విజయపురిసౌత్, తాడేపల్లి**

నాగార్జున సాగర్ రిజర్వాయర్‌కు వరద ఉధృతి కొనసాగుతోంది. శ్రీశైలం జలాశయం నుండి 1,72,774 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వస్తుండడంతో ప్రాజెక్టు 26 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 2,03,502 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువ నుండి వరద నీరు స్వల్పంగా తగ్గుముఖం పట్టడంతో గురువారం మధ్యాహ్నం 8 గేట్లను 10 అడుగుల నుండి 5 అడుగులకు దించారు. నాగార్జున సాగర్ డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకు కాగా ప్రస్తుతం 587.40 అడుగుల వద్ద నీరుంది. డ్యామ్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలు కాగా ప్రస్తుతం 305.7464 టీఎంసీల నిల్వ ఉంది. ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 29,576 క్యూసెక్కులు, కుడి కాల్వ ద్వారా 1540 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బిసి ద్వారా 2400 క్యూసెక్కులు, మొత్తంగా రిజర్వాయర్ నుండి 2,36,958 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

ఇదిలా ఉండగా నీరు ప్రవహిస్తున్న నాగార్జున సాగర్ డ్యామ్ అందాలను ప్రత్యక్షంగా చూసేందుకు పర్యాటకులు భారీ సంఖ్యలో వస్తున్నారు. జలవిద్యుత్ కేంద్రం వద్దకు వెళ్లి డ్యామ్ అందాలను తిలకిస్తున్నారు. లాంచీ స్టేషన్ వద్ద, కొత్త బ్రిడ్జి, పాత వంతెన, డ్యామ్ ప్రవేశ భాగంలో పర్యాటకుల సందడి వాతావరణం నెలకొంది.


ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. గురువారం సాయంత్రం ప్రకాశం బ్యారేజీకి 5 లక్షల 52 వేల 640 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా అదే స్థాయిలో నీటిని 70 గేట్లను ఎత్తి దిగువకు సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. గురువారం ఉదయం నుండి గంట గంటకూ నీటి ఉధృతి పెరగడంతో ప్రకాశం బ్యారేజీ అధికారులు 2వ ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. రెవెన్యూ, పోలీస్, విపత్తుల నిర్వహణ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. మరోవైపు కృష్ణమ్మ పరవళ్లను చూడటానికి విజయవాడ నగరం నుండే గాక చుట్టుపక్కల గ్రామాల నుండి పెద్ద ఎత్తున సందర్శకులు బ్యారేజీ వద్దకు చేరుకుంటున్నారు. అయితే వీరంతా వాహనాలను బ్యారేజ్ మీదే పార్క్ చేయటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

# స్నేహితుని వద్దే రూ.70 లక్షల అపహరణ


వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

**ప్రజాశక్తి - మేడికొండూరు**

మండల పరిధిలో జరిగిన దారి దోపిడి పక్కా పథకం ప్రకారమే జరిగిందని తుళ్లూరు డిఎస్‌పి మురళీకృష్ణ అన్నారు. ఈ మేరకు వివరాలను మేడికొండూరు పోలీస్‌స్టేషన్‌లో గురువారం వెల్లడించారు. ఈనెల 4న జరిగిన రూ.70 లక్షల నగదు, కారును అపహరించినట్లు విజయవాడలో నివాసం ఉంటున్న జగదీష్ ఫిర్యాదుపై మేడికొండూరు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. జగదీష్‌కు స్నేహితుడైన రంజిత్ ఈనెల 14న బంగారపు మాల్ ఉందని జగదీష్‌ను నమ్మించి కేజీ రూ.50 లక్షలు చొప్పున రెండు కేజీలు ఉందని చెప్పగా అందుకు జగదీష్ తన వద్ద రూ.70 లక్షలే ఉందని, మిగతావి రెండు రోజుల తర్వాత ఇస్తానని చెప్పడంతో అందుకు రంజిత్ అంగీకరించాడు. సత్తెనపల్లికి డబ్బులు తీసుకొని రమ్మని చెప్పి అక్కడ బంగారపు మాల్ పరిశీలించుకుని డబ్బులు ఇవ్వాలని అన్నారు. అందుకు అంగీకరించిన జగదీష్ తన కారులో సత్తెనపల్లి వచ్చి అక్కడ ఉన్న రంజిత్, మరో ఇద్దరు వ్యక్తులతో మాట్లాడి బంగారపు మాల్‌ను పరిశీలించాడు. వెంటనే రంజిత్ ఈ మాల్ ఎక్కువ కేజీలు ఉందని మనం విజయవాడలో తూకం వేయించుకొని అక్కడ డబ్బులు బంగారం మార్చుకుందామని చెప్పి ఎవరి కారులో వాళ్ళు విజయవాడకు పయనమయ్యారు. మార్గమధ్యంలో ముందు కారులో వెళ్తున్న జగదీష్‌ను రంజిత్ తనకు పరిచయస్తులైన నలుగురితో మేడికొండూరు సమీపంలో అడ్డగించి ఆపారు. కారులో నుంచి ఇద్దరు వ్యక్తులు పోలీస్ దుస్తులలో దిగి జగదీష్‌ను కారులో నుంచి దించి కారును తనిఖీ చేశారు. తాము విజిలెన్స్ అధికారులమని, రూ.70 లక్షలు ఎక్కడివని ప్రశ్నించారు. విజయవాడ వచ్చి ఈ డబ్బుకు లెక్క చూపించుకొని తీసుకెళ్లాలని చెప్పి కారును, డబ్బును తీసుకెళ్లారు. జగదీష్ తన స్నేహితులకు ఈ విషయం తెలిపి వారు రాగానే చుట్టుప్రక్కల వెతికి సత్తెనపల్లి వెళ్లి పోలీసులకు వివరాలు చెప్పారు. అనంతరం వారి సూచనలతో మేడికొండూరులో ఫిర్యాదు చేశారు. మరోవైపు 13వ తేదీన పిడుగురాళ్లలో సోరియాసిమ్ కంపెనీ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ఈ కేసులో నిందితులైన అంకుష్, మహాదేవ్‌ను విచారణ చేశారు. కారులో రూ.40 లక్షల నగదు, రూ.ఆరు లక్షల బంగారం గుర్తించారు. విచారణ చేయగా మేడికొండూరు పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసుతో సంబంధం ఉందని తేలి స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు రాజమహేంద్రవరానికి చెందిన రంజిత్ మిగతా వారికోసమూ గాలిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసులో ప్రతిభ చూపిన మేడికొండూరు సిఐ నాగూర్ మీరాసాహెబ్, ఎస్ఐ సుబ్బారావు, కానిస్టేబుల్ జాన్‌సైదా, బాజీ సాహెబ్‌ను ఎస్పీ అభినందించారు.


స్వాధీనం చేసుకున్న నగదు, ఆభరణాలు

## ఎఎంఎం రెడ్డి విద్యార్థుల హర్ ఘర్ పర్ తిరంగా ర్యాలీ

**ప్రజాశక్తి-పల్నాడు జిల్లా :** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నరసరావుపేట మండలం పెట్లూరివారిపాలెంలోని ఎఎం.రెడ్డి స్మారక ఫార్మసీ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో గురువారం గ్రామంలో హర్ ఘర్ పర్ తిరంగా ర్యాలీ చేపట్టారు. ర్యాలీని ప్రారంభించిన కళాశాల సెక్రటరీ అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఎందరో వీరుల త్యాగఫలితం స్వాతంత్ర్యమని, ఆ ఫలాలాను భారతీయులంతా ఆస్వాదిస్తున్నారని అన్నారు. ప్రతి ఒక్కరూ జాతీయ భావం కలిగి ప్రతి ఒక్క ఇంటి పైన త్రివర్ణ భారతీయ జెండాను ఎగరవేయాలనే ప్రధాని ఆకాంక్షకు అనుగుణంగా తాము ర్యాలీ చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.భార్గవ్ భూషణ్‌రావు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.అశోక్‌కుమార్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



### ఎపిసిపిడిసిఎల్ అమరావతి డివిజన్ పరిధిలో
## 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ప్రజాశక్తి మంగళగిరి

అమరావతి డివిజన్ పరిధిలో నిరంతర వర్షాల కారణంగా విద్యుత్ ప్రమాదాలు, నష్టాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు ఎపీసీపీడీసీఎల్ అమరావతి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జంగం సంజీవరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్రమంలో ఆగస్టు 14వ తేదీ నుండి 16వ తేదీ వరకు 24 గంటల పహారా విధానంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. విద్యుత్ సరఫరా స్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, క్షేత్రస్థాయి సిబ్బంది నుండి నివేదికలు స్వీకరించేందుకు జూనియర్ ఇంజినీర్లు, కంప్యూటర్ ఆపరేటర్లను క్రమ పద్ధతిలో విధుల్లోకి నియమించినట్లు ఆయన తెలిపారు. భారీ వర్షాల కారణంగా ప్రజలకు ఎటువంటి విద్యుత్ సమస్యలు ఎదురైన వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు: మొబైల్ 62817 03602, ల్యాండ్‌లైన్ 08645-293733.





# నదీపరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : మంత్రి

ప్రజాశక్తి - కొల్లిపర

కృష్ణా పరివాహ ప్రాంత గ్రామాల ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు అందుబాటులో ఉంటారని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ప్రకాశం బ్యారేజీ నుండి దిగువకు సుమారు 6 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల చేయడంతో గురువారం మంత్రి నాదెండ్ల మనోహర్ కృష్ణా పరివాహ ప్రాంతాలను కరకట్ట పైపరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడ ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని కరకట్టపై 24 గంటలు పోలీస్ రెవెన్యూ సిబ్బంది పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసరమైతే సమాచారం పై అధికారులకు తెలియజేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వాడుకునేందుకు రెండు బోట్లను కూడా సిద్ధం చేశామని తెలిపారు. అవసరమైతే వరద ముంపు గ్రామాల్లో పిడిఎఫ్ బియ్యం నిత్యవసర సరుకులను అందుబాటులో ఉంచుకునేందుకు చర్యలు తీసుకోవాలని తాహశీల్దార్‌కు సూచించారు. వర్షాకాలం కారణంగా వ్యాధులు ప్రభులే అవకాశం ఉన్నందున రేపటినుండి ప్రతి గ్రామంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయడంతో పాటు ఇంటింటికి ఏఎన్ఎం వెళ్లి అవసరమైన మందులు సరఫరా చేస్తారని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎవరికి ప్రాణనష్టం జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదని, ప్రతి ఒక్కరూ అధికారులకు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తెనాలి సబ్ కలెక్టర్ సంజన సింహ తాసిల్దార్ సిద్ధార్థ తెదేపా నాయకులు జనసేన నాయకులు పాల్గొన్నారు



సమావేశంలో ప్రసంగిస్తున్న ఆలపాటి రాజేంద్ర ప్రసాద్

## నిఘా పటిష్టతోనే నేరాల నియంత్రణ సాధ్యం

### ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సమాజంలో నిఘా వ్యవస్థలు బలోపేతమైతేనే నేరాలు తగ్గి ప్రజలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అన్నారు. గుంటూరు లోని కాటన్ అసోసియేషన్ హాల్లో గురువారం సత్య ఇన్వెస్టిగేషన్ సెక్యూరిటీ సర్వీసెస్ (ఎస్ ఐ ఎస్ ఎస్) పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ను ఆయన ప్రారంభించారు. ఆలపాటి మాట్లాడుతూ జనాభా పెరుగుదలకు అనుగుణంగా పోలీసుల సంఖ్య పెరగడం లేదన్నారు. అందువల్ల ప్రభుత్వ, ప్రైవేట్ నిఘా, రక్షణ వ్యవస్థల ఆవశ్యకత పెరుగుతుందన్నారు. మాజీ డిజిపి ఎం.మాలకొండయ్య మాట్లాడుతూ సమాజంలో ప్రభుత్వ వ్యవస్థతో పాటు ప్రైవేటు సెక్యూరిటీ వ్యవస్థ కూడా కీలక భూమిక పోషిస్తుందన్నారు. ఈ సందర్భంగా రూపొందించిన వెబ్ సైట్ ను రేరా మాజీ చైర్మన్ డాక్టర్ ఎలమాటి రామనాథం ప్రారంభించారు. ఆడిటర్ వి భార్గవి, మాజీ ఐజి రవిచంద్ర, సత్య సెక్యూరిటీ సంస్థ ఎండి కాళహస్తి సత్యనారాయణ, ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ చందు సాంబశివరావు, రిటైర్డు డిఎస్పీలు సుబ్బారెడ్డి, కె.వి నారాయణ, పోతురాజు, ఏపీ కాటన్ అసోసియేషన్ కార్యదర్శి కొర్రపాటి రామారావు, పెదనందిపాడు కళాశాల ప్రిన్సిపల్. డాక్టర్ రాఘవయ్య, ఎలమంచిలి శ్రీధర్, నర్రా బాలకష్ణ, పాతూరి శ్రీనివాసరావు,కోదండ రామయ్య, దివ్యభారతి, మేరిగ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## జగన్‌కు కనువిప్పు కలగాలి : ఎమ్మెల్యే మాధవి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి


పులివెందుల,ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికలు ప్రజాస్వామ్య బద్ధంగా జరగటంతో, తన ఓటమిని ముందే పసిగట్టిన మాజీ సిఎం వైఎస్ జగన్ అసహనంతో చంద్రబాబును దూషిస్తూ మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి మండిపడ్డారు. గురువారం తన కార్యా లయంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేశామని ఆమె తెలిపారు. శుక్రవారం నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. గతంలో ఎప్పుడు ఎన్నికలు జరగకుండా ప్రతిపక్షాలను అడ్డుకొని ఏకపక్షంగా ఏకగ్రీవం చేసుకున్న జగన్‌కు తొలి సారి ప్రజాస్వామ్యం గుర్తుకు వచ్చిందన్నారు. పులివెందుల, ఒంటిమిట్ట ప్రజల న్యాయమైన తీర్పును తట్టుకోలేని వ్యక్తి ఈ విధంగా విరుచుకుపడతాడని తాము ముందే ఊహించామని తెలిపారు. ప్రజల సమస్యలను పక్కనబెట్టి, కక్షసాధింపు రాజకీయాలు, కేసులు పెట్టడం, ప్రతిపక్ష నేతలను జైలుకు పంపడం, అవినీతి కుంభకోణాలు, కుటుంబపరంగా విభేదాలు సృష్టించడంతోనే ఐదేళ్లపాలన పూర్తి చేసిన జగన్ ఇప్పుడు ప్రజాస్వామ్యం, నీతి నిజాయితీ గుర్తుకు రావడం విడ్డూరంగా ఉందన్నారు.

# నాట్కో కేంద్రంలో సౌకర్యాలు పెంచుతాం

### కేన్సర్ ఆస్పత్రిని సందర్శించిన నోరి దత్తాత్రేయుడు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు, ప్రఖ్యాత క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు, అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ రఘునందన్‌తో కలిసి గురువారం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలోని నాట్కో కేన్సర్ కేంద్రాన్ని సందర్శించారు. ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేయనున్న పెట్ సిటీ స్కాన్ ని పరిశీలించారు. క్యాన్సర్ వైద్యంలో అతి ముఖ్యమైన ఈ పెట్ సిటీ స్కాన్ యొక్క ఇన్స్టాలేషన్ పనులు ఎలా జరుగుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వి రమణ ఆస్పత్రిలో పరికరాల వినియోగంపై వారికి వివరించారు. డాక్టర్ దత్తాత్రేయుడుమాట్లాడుతూ క్యాన్సర్ వైద్యం సంబంధించి అన్ని సదుపాయాలు ప్రభుత్వం నుంచి రావాల్సిన ప్రతి ఒక్కటి కూడా వచ్చే విధంగా ప్రణాళికను రూపొందిస్తామన్నారు. అదేవిధంగా అన్ని



విభాగాలు జనరల్ సర్జరీ, ఈఎన్టీ, ఆర్థోపెడిక్ మొదలగు క్యాన్సర్ ట్యూమర్ వ్యాధికి సంబంధించిన అన్ని కేసులకి కూడా ప్రభుత్వ సమగ్ర వైద్యశాల గుంటూరు నాట్కో సెంటర్‌లో వైద్యం అందుబాటులో తెలిపారు. ఇన్ పేషెంట్గా అడ్మిట్ అయ్యే వారికి పెట్ సిటీ స్కాన్ ని ఆరోగ్యశ్రీలో అందుబాటులో తెచ్చే విధంగా ప్రయత్నం చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాట్కో కోఆర్డినేటర్ శ్రీ వై అశోక్ కుమార్ , సిబ్బంది పాల్గొన్నారు

## ఘనంగా జెకెసి గ్రాడ్యుయేషన్ డే ఉత్సవాలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులోని "జాగర్లమూడి చంద్రమౌళి కాలేజీ ఆఫ్ లా "లో గురువారం 'గ్రాడ్యుయేషన్ డే' నిర్వహించారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, కళాశాల కరస్పాండెంట్ మాజీ ఎమ్మెల్సీ.రాయపాటి శ్రీనివాస్ ,ప్రిన్సిపాల్ సుధాకర్, నాగార్జున ఎడ్యుకేషనల్ సొసైటీ బోర్డు సభ్యులు హాజరు అయ్యారు. విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా తెలుగుయువత అధ్యక్షులు రావిపాటి సాయి కష్ణకి ఆలపాటి, రాయపాటి న్యాయ డిగ్రీ పట్టాను ప్రధానం చేశారు. పలువురు ప్రముఖులు సాయికృష్ణకు శుభాకాంక్షలు తెలిపారు.

# పెనుమాక సొసైటీ అధ్యక్షునిగా కళ్లం శివ గోవిందరెడ్డి



ప్రజాశక్తి- తాడేపల్లి

పెనుమాక వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షులుగా గ్రామానికి చెందిన కళ్లం శివగోవిందరెడ్డి ఎంపికయ్యారు. ఆయనతో గురువారం స్థానిక సొసైటీ కార్యాలయం సమీపంలో రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘాలు మరింత బలోపేతం దిశగా అడుగులు వేయాలని ఆకాంక్షించారు. శివ గోవింద్ రెడ్డి మాట్లాడుతూ రైతుల అభ్యున్నత్తే ధ్యేయంగా పనిచేస్తానని అన్నారు. రైతులకు కావాల్సిన ప్రభుత్వం నుండి వచ్చే అన్ని రకాల పథకాలను అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఇదిలా ఉండగా సొసైటీ డైరెక్టర్లుగా పెనుమాకకు చెందిన నెమలికంటి సాంబశివరావు, ఉండవల్లికి చెందిన సిగిరిశెట్టి రమాదేవి కూడా ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొంతు శివసాంబిరెడ్డి, గుంటూరు జిల్లా అధ్యక్షులు కళ్ళం రాజశేఖర్‌రెడ్డి, నాయకులు డి.కృష్ణ, కె.కిరణ్ పాల్గొన్నారు.

## ఆర్‌విఆర్ జెసిలో వందశాతం సీట్లు భర్తీ

ప్రజాశక్తి-గుంటూరు

ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజిలో 2025-26 సంవత్సరానికి అన్ని బ్రాంచీలలో వంద శాతం సీట్ల భర్తీ అయినట్లు కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె. మద్దినేని ఒక ప్రకటనలో తెలిపారు. ఎపి ఎంసెట్ కన్వీనర్ కోటా 2వ దశ కౌన్సెలింగ్ సీట్ల కేటాయింపును ప్రభుత్వం గురువారం విడుదల చేసిందన్నారు. తమ కళాశాలలో ఇంజినీరింగ్ సీట్ల ప్రవేశప్రారంభ, ముగింపు ర్యాంకులు గత సంవత్సరం కన్నా ముందస్తు మెరుగైన ర్యాంకులతో సీట్ల భర్తీ ప్రక్రియ జరగడంతోపాటు కోర్ ఇంజనీరింగ్ బ్రాంచులలో కూడా ఉత్తమ ర్యాంకులతో అన్ని సీట్లు భర్తీ అయ్యాయన్నారు. తమ కళాశాలను ఎంచుకున్న విద్యార్థులు తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.

## నేటి నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్త్రీ శక్తి ద్వారా ప్రవేశపెట్టనున్న మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని నేడు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించనున్నట్లు తెనాలి ఆర్టీసి డిపో మేనేజర్ ఎ రాజశేఖర్ గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ పథకాన్ని తెనాలి పరిసర ప్రాంతాల మహిళలు సద్వినియోగ పరుచుకోవాలని తెలియ జేసారు.



## నంబూరులో ఎమ్మెల్యే నరేంద్ర పరిశీలన

ప్రజాశక్తి - పెదకాకాని

మండల పరిధిలోని నంబూరు గ్రామంలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తెలుసుకోవడం కోసం పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ గురువారం నంబూరు గ్రామంలో పర్యటించారు. గ్రామంలో ముంపుపకు గురైన ప్రతి కాలనీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా నరేంద్ర మాట్లాడుతూ నంబూరు గ్రామ కూడలిలో ఉన్న చప్టా స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మాణం కోసం అంచనాలు తయారు చేయవలసిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. హై లెవెల్ ఛానల్‌కు పడిన గండిని వెంటనే పుడ్చాలని, గ్రామ చివర ఉన్న మురుగు కాలవను పరిశీలించి కాలువలో ఉన్న చెట్లు తూటికాడలను వెంటనే తీయాలని భవిష్యత్తులో వెడల్పు చేయడానికి సర్వే చేయించి ప్రణాళికలు. సిద్ధం చేయాలన్నారు. పంట పొలాల్లో వరద నీరు పడకుండా తగిన విధంగా భవిష్యత్తులో కాలవల్లో వెడల్పు చేయవలసిందిగా,మునిగిపోయిన ప్రతి రైతు నష్ట పరిహారం అందించే విధంగా లబ్ధిదారుల జాబితా తయారు చేయ వలసిందిగా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నంబూరు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాకిరెడ్డి జయ రామిరెడ్డి, ప్రభుత్వ అధికారులు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## గల్లంతైన యువకుడు మృతి

ప్రజాశక్తి - తుళ్లూరు



మండలంలోని ఉద్దండరాయునిపాలెం వద్ద కృష్ణానదిలో గల్లంతైన ఇద్దరు యువకులలో ఒకని మృతదేహం లభ్యమైంది. బుధవారం కృష్ణానది వరద ఉధృతిలో పసంగి వీర ఉపేంద్ర (22), పసంగి కామేశ్వరరావు అనే అన్నదమ్ములు కొట్టుకుపోయారు. మత్స్యకారులైన వీరిద్దరి ఆచూకీ కోసం ఎస్ డి ఆర్ ఎఫ్ బందం,స్థానిక పోలీసులు గురువారం కృష్ణానదిలో గాలింపు చేపట్టారు. వెంకటపాలెం నేషనల్ హైవే వంతెన పరిసర ప్రాంతంలో వీర ఉపేంద్ర మతదేహం లభ్యమైంది. బుధవారం ఉదయం 9 గంటల సమయంలో ఇసుక తోడే డ్రెజర్ స్థానం మార్చేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో యువకులు నదిలో కొట్టుకుపోయారు. వీరు తాడేపల్లి సీతానగరంలో నివాసం ఉంటున్నారు. స్వగ్రామం తెనాలి సమీపంలోని పెదపాలెం గ్రామం. మరొక యువకుడు కామేశ్వరరావు కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.



## ఉధృతంగా కుప్పగంజివాగు

ప్రజాశక్తి - నాదెండ్ల

నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని వాగులు వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గణపవరం-చిలకలూరిపేట మార్గంలో కుప్పగంజి వాగు పొంగిపొర్లుతోంది. అయినా అక్కడ సరైన భద్రతా ఏర్పాట్లు చేయలేదని గ్రామస్తులు ఆందోళనకు గురవుతున్నారు. గతంలో అక్కడ ఎన్నో ప్రమాదాలు జరిగి ప్రాణనష్టమూ వాటిల్లిన సందర్భాలు ఉన్నాయని గుర్తు చేసుకుంటున్నారు. ఈ వాగు గణపవరం గ్రామానికి కూతవేటు దూరంలో ఉండటం వల్ల పొలాలకు వెళ్లి పశువుల మేపుకునేందుకు, పశువుల గడ్డి తెచ్చుకోవడానికి ఇబ్బందిగా ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ వాగుపై బ్రిడ్జి నిర్మిస్తే ఈ ఇబ్బందులేమీ ఉండవని అంటున్నారు.



## చప్టాలపై నీళ్లు.. రాకపోకలకు అవస్థలు

ప్రజాశక్తి - పెదకూరపాడు

వానల నేపథ్యంలో మండలంలోని పరస-ఖమ్మంపాడు గ్రామాల మధ్య వాగు మూడ్రోజులుగా ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ రెండు గ్రామాల మధ్య చప్టాలపై 2 నుండి 4 అడుగుల ఎత్తు వరకూ నీరు ప్రవహిస్తుండడంతో వాహన రాకపోకలను నిలిపేశారు. కొన్ని ద్విచక్ర వాహనాలు మాత్రం వెళ్తున్నాయి. ఈ సమయంలోనూ ఎంతో జాగ్రత్తగా వెళ్లాల్సి వస్తోంది. లేకుంటే వాహనాలు పాడవడంతోపాటు ఆదమరిస్తే అంతే సంగతులనేవిధంగా పరిస్థితి ఉంది. దీంతో కొంతమంది తమ ద్విచక్ర వాహనాలను స్థానిక కూలీల ద్వారా చప్టా ఒకవైపు నుండి మరో వైపునకు మోపించుకుంటున్నారు. శుక్రవారం ఉదయం వరకూ వాగు ఉధృతి ఇదే విధంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు.

## కౌన్సిలర్లంతా మళ్లీ గైర్హాజరు

### మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక వాయిదా

ప్రజాశక్తి - మాచర్ల

కౌన్సిలర్లు ఎవరూ హాజరుకాకపోవడంతో గురువారం జరగాల్సిన మాచర్ల మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక మరోసారి వాయిదా పడింది. వైస్‌చైర్మన్ ఎన్నిక బుధవారం జరగాల్సి ఉండగా కౌన్సిలర్లు ఎవరూ హాజరుకాకపోవటంతో తిరిగి గురువారం నిర్వహించారు. ఎన్నిక సమావేశానికి 31 కౌన్సిలర్లులో ఏ ఒక్క కౌన్సిలర్ కూడా హాజరు కాకపోవడంతో ఎన్నిక జరగలేదు. విషయాన్ని రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ దృష్టికి తీసుకెళ్లి వారి మేరకు ఎన్నిక నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు తెలిపారు. ఇదిలా ఉండగా గత స్థానిక ఎన్నికల్లో మాచర్ల మున్సిపాల్టీని వైసిపి కైవసం చేసుకోగా సార్వత్రిక ఎన్నికల అనంతరం ఎక్కువ మంది కౌన్సిలర్లు టిడిపి వైపు వచ్చారు. వైస్‌చైర్మన్ పదవికి ఇద్దరు ముగ్గురు పోటీ పడుతుండగా ఎవరనేది నిర్ణయం కాకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తినట్లు తెలిసింది.

# చదువుల నేలపై కబ్జా కోరలు

- అన్యాక్రాంతమవుతున్న ఎస్‌కెబిఆర్ కాలేజీ భూములు
- ఎందరో విద్యావంతులను అందించిన కళాశాల
- ఎన్నికల హామీగానే మిగులుతున్న పీజీ సెంటర్ ఏర్పాటు
- పల్నాడు విద్య మణిహారం శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల
- నేడు 60వ వసంతంలోకి అడుగు




**వెనుకబడిన పల్నాడు ప్రాంతంలో విద్యా విజ్ఞాన దీపాలు వెలిగించి, సామాజిక, ఆర్థిక మార్పులో కీలక పాత్ర పోషిస్తున్న మాచర్లలోని శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల 59 ఏళ్లు పూర్తిచేసుకొని 60వ వసంతంలోకి అడుగుపెడుతోంది. ఎందరో మేధావులు, కవులు, కళాకారులు, రచయితలు, పారిశ్రామిక వేత్తలు, ప్రజా సేవకులు, ప్రముఖులను సమాజానికి అందించిన విద్యాలయం మాచర్ల పట్టణంలో 1966లో ప్రారంభమైంది. చైతన్య దీపికగా, విద్యార్థి ఉద్యమాలకు, పోరాటాలకు నెలవుగా నిలిచి, విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిన ఎస్‌కెబిఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజికి ఘనచరిత్రే వుంది.**

ప్రజాశక్తి - మాచర్ల

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కళాశాలల స్థాపనకు కనీసం రూ.5 లక్షలు విరాళం సేకరించాలని ప్రభుత్వం నిబంధన పెట్టింది. గురజాల ఎమ్మెల్యే కొత్త వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ బొజ్జా ఆదినారాయణ సహకారంతో అప్పటి మాచర్ల పంచాయతీ సమితి అధ్యక్షులు జూలకంటి నాగిరెడ్డి ప్రజల నుండి రూ.3 లక్షలు విరాళాలు సేకరించి 1966 మే 8న అప్పటి సిఎం కాసు బ్రహ్మానందరెడ్డిని కలిసి కళాశాల ఏర్పాటుకు విజ్ఞప్తి చేశారు. 1966 జూన్ 16న రాష్ట్రంలో మాచర్లతోపాటు తాడేపల్లిగూడెం, ప్రొద్దుటూరులో కొత్త కాలేజీలను నెలకొల్పుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. జులై 1966న మాచర్ల పిడబ్ల్యూడీ కాలనీలోని ప్రస్తుత జిల్లా పరిషత్ బాలుర ఉన్న పాఠశాల ప్రదేశంలోని వర్క్‌షాపు షెడ్లల్లో కాలేజి ఏర్పాటు చేశారు. గూడూరు శ్రీ సన్నపరెడ్డి కృష్ణారెడ్డి ప్రభుత్వ కళాశాలకు ప్రథమ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న డాక్టర్ టి.ఎస్. పాలస్ బదీలిపై వచ్చి 1966 జులై5న మాచర్ల ప్రభుత్వ కళాశాలకు ప్రథమ పిన్సిపాల్‌గా ఛార్జ్ తీసుకున్నారు. కళాశాలలో ఆ సంవత్సరం పి.యు.సి క్లాసుతోనే ప్రారంభమైంది. 320 మంది విద్యార్థులను చేర్చుకోవటానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. 1966 ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం రోజున కళాశాలను ప్రారంభించారు. కాలేజీని ప్రారంభించిన తొలినాళ్లలో గుంటూరు జిల్లాలో రెండు ప్రభుత్వ కళాశాలలు మాత్రమే ఉన్నాయి. అందులో ఒకటి గుంటూరు ఉమెన్స్ కాలేజ్ ఇంకొకటి మాచర్లలోని ఎస్‌కెబిఆర్ గవర్నమెంట్ కాలేజ్. మాచర్లలో చదువుకోవటానికి రైలులో గుంటూరు నుండి విద్యార్థులు వచ్చేవారు. 1982లో సిఎంగా పదవి చేపట్టిన భవనం వెంకట్రామిరెడ్డి మాచర్ల కళాశాలకు సాగర్, శ్రీశైలం రోడ్డులో 67.15 ఎకరాలు కేటాయించి, నిర్మాణానికి రూ.19 లక్షలు విడుదల చేశారు. 1985లో నూతన భవనాల్లోకి చేరిన కళాశాల నేటికీ కొనసాగుతోంది.

### ఎందర్నో తీర్చిదిద్దిన కళాశాల

ఈ కాలేజీలో చదివిన వారిలో పోలవరం ప్రాజెక్ట్ రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ బి.సుధాకర్ బాబు, రిటైర్డు జిల్లా విద్యాధికారి డాక్టర్ బండారు సుబ్బారావు, భారతదేశంలో ప్రముఖ న్యూరాలజిస్టు ఒకరైన డాక్టర్ తారక శ్రీనివాస్ నాయక్, రిటైర్డు గుంటూరు మెడికల్ కళాశాల ఆప్తమాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ల్యాం సంధ్యావల్లి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన డొక్కా మాణిక్ వరప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, ప్రస్తుత మాచర్ల మున్సిపల్ చైర్మన్ మదర్ సాహెబ్‌తో పాటు అనేకమంది వీసీలు, ప్రొఫెసర్లు, లెక్చరర్లుగా, ఇంజినీర్లను, టీచర్ల గాను, ప్రముఖ వ్యాపారస్తులుగా ఎదిగారు. మావోయిస్టు అగ్రనేత ఆర్కే (రామకృష్ణ), హక్కులనేత, చుండూరు కేసులో దళితుల తరపున హైకోర్టులో వాదించిన భువనగిరి చంద్రశేఖర్ కూడా ఈ కళశాలలో చదివినవారే.

### ఎన్నికల హామీగానే పీజీ సెంటర్ ఏర్పాటు

మాచర్ల కళాశాలలో పీజీ సెంటర్ ఏర్పాటు చేయాలనేది దశాబ్ధాల డిమాండ్. ప్రతి ఎన్నికల సమమయంలో ఆయా రాజకీయ పార్టీల నాయకులు దీనిపై హామీనిస్తున్నా గెలిచాక విస్మరిస్తున్నారు. కళాశాల ఏర్పాటులో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి తండ్రి నాగిరెడ్డి కీలక పాత్ర పోషించారని, ఇప్పుడు బ్రహ్మారెడ్డి పీజీ సెంటర్ సాధిస్తే బాగుంటుందని పల్నాడు వాసులు భావిస్తున్నారు.

### అన్యాక్రాంతమవుతున్న కళాశాల భూములు

కళాశాలకు పట్టా భూములు 26.87 ఎకరాలు, ప్రభుత్వ భూములు 36.3 ఎకరాలు, బిసి (అన్‌సర్వేయడ్) భూములు 4.5 ఎకరాలు మొత్తం 67.15 ఎకరాలు ఉండగా, రేడియో స్టేషన్‌కు 4.97 ఎకరాలు, జూనియర్ కళాశాలకు 10 ఎకరాలు, ఆర్ అండ్ బికి 2.68 ఎకరాలు, విద్యుత్ శాఖకు ఒక ఎకరం ప్రభుత్వం కేటాయించింది. కేటాయింపులుగా పోగా 48.65 ఎకరాలు మిగిలింది. మిగిలిన కళాశాల భూములు కూడా కొంత ఆక్రమణలు జరిగాయని, ప్రభుత్వం సర్వే చేస్తే అసలు ఎంత భూమి వుందో తేలుతుందని స్థానికులంటున్నారు.

### కాలేజీకి రూ. 25 లక్షలు విరాళాలు



పూర్వ విద్యార్థులం కలిసి రెండేళ్ల క్రితం కళాశాల అభివృద్ధికి రూ. 25 లక్షలు విరాళాలు ఇచ్చాం. వాటిలో కళాశాల మరమ్మతులు, కంప్యూటర్లు, 150 బెంచీలు తదితర వస్తువులు కొనుగోలు చేశారు. అప్పటి కలెక్టర్‌ను కలిసి కళాశాలకు రహదారికి నిధుల కోసం విజ్ఞప్తి చేయగా రూ.25లక్షలు మంజూరు చేశారు. కళాశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేశాం, భవిష్యత్తులో కూడా చేస్తాం.

**వేముల నాగయ్య, రిటైర్డు ఎంఈవో, పూర్వ విద్యార్థి.**

### కాలేజీ భూములను కాపాడాలి



పట్టణం పెరిగిపోవటం, భూములు అధిక ధరలు పలకటంతో కళాశాల భూములు ఆక్రమణలకు గరవుతున్నాయి. కాలేజీ భూములు గుర్తించటం కూడా కష్టంగా మారింది. ప్రభుత్వం సర్వేచేసి, కళాశాల భూములు ఆక్రమణలకు గురికాకుండా ప్రహరీ నిర్మించాలి. కళాశాల భూముల్లో పీజి సెంటర్, ఐటిఐ, పాలటెక్నిక్, కేంద్రీయ విద్యాలయం వంటివి స్థాపించవచ్చు.

**కుర్రి సాయిమార్కోండారెడ్డి, చక్రధర్ డిగ్రీ కాలేజి ప్రిన్సిపల్, పూర్వ విద్యార్థి.**

### పీజీ సెంటర్ ఏర్పాటు చేయాలి



ఈ కాలేజీని పీజీ సెంటర్ లేదా పల్నాడు యూనివర్సిటీ చేస్తే ఈ ప్రాంతం వారు ఇక్కడే ఉన్నత చదువులు చదవొచ్చు. పేదలు ఎక్కువగా వుండే ఈ ప్రాంతంలో పీజీ సెంటర్, యూనివర్సిటీ ఏర్పాటు అవసరం. అది చేయటానికి కళాశాల భూములు అందుబాటులో వున్నాయి.

**కేళం ఆదినారాయణ, లెక్చలర్, పూర్వ విద్యార్థి.**

## పత్తి పైరుకు వానదెబ్బ


బొలుసుపాడులో నీట మునిగిన పత్తి పొలాలు

ప్రజాశక్తి - పెదకూరపాడు

భారీ వానల నేపథ్యంలో పత్తిపైరుకు నష్టం వాటిల్లే ప్రమాదం ఏర్పడింది. మండలంలో గతేడాది 8000 ఎకరాల్లో పత్తి సాగు చేయగా ఈ ఏడాది కూడా అదే విస్తీర్ణంలో సాగు చేసే అవకాశం ఉంది. చిన్న మక్కెన, లింగంగుంట్ల, పొడపాడు, ముస్సాపురం, పాటిబండ్ల జలాల్పురం, ఖమ్మంపాడు బలుసుపాడు గ్రామాలతో పాటు మిగిలిన గ్రామాల్లో పల్లపు నేలలు, వాగులు వెంట ఉన్న పొలాలు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది. సుమారుగా 1500 నుంచి 2000 ఎకరాల వరకు నష్టం ఉండవచ్చునని అంచనా. ఇప్పటికే పత్తి పైరు నెల రోజులు దశకు చేరింది. పెట్టుబడి కూడా దాదాపు సగం వరకు పెట్టినట్లు రైతులు చెబుతున్నారు. ఈ దశలో వర్షం తమ పైర్లను ముంచేసింది. రోజులు గడిస్తే పైరు దెబ్బతిని తాము అప్పులపాలవడం ఖాయమని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. శనగ, మొక్కజొన్న సాగు కోసమని ఉంచిన పొలాలు సైతం కోతకు గురయ్యాయి. పలుచోట్ల గండ్లు పడగా వాటిని పూడ్చడానికి రైతులకు అదనపు ఖర్చు తప్పదు. ముంపు బారిన పడిన పొలాలను మండల వ్యవసాయాధికారి డి.కృష్ణయ్య గురువారం పరిశీలించగా తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

# ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ముంపు బెడద

**అధికారులను ముందే హెచ్చరించినా పట్టించుకోని వైనం - కాల్వకట్టల పటిష్టత కోసం ఇచ్చిన ఫిర్యాదులు బుట్టదాఖలు**

**చిన్నారులూ ప్రాణాలు కోల్పోతున్నారు : సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు, ఈమని అప్పారావు**

ప్రజాశక్తి - పెదకాకాని



గత రెండు రోజులుగా కురుస్తున్న అధిక వర్షాలు పలు గ్రామాల రాకపోకల పై తీవ్ర ప్రభావం చూపించాయని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు తెలిపారు. గురువారం మండలంలోని పలు గ్రామాలలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు, మండల కార్యదర్శి నన్నపనేని శివాజి నాయకులు ఎం శ్రీనివాసరావు, ఎస్ నీలాంబరం తదితరులతో కలసి ఆయన పర్యటించి వరద తీవ్రతను అంచనా వేశారు. ఈ సందర్భంగా పాశం రామారావు మాట్లాడుతూ అధిక వర్షాలు, గుంటూరు ఛానల్ కట్టలు తెగిపోవటం, మురుగు నీటి కాలువ తీవ్ర ప్రవాహం వల్ల ప్రజలు వరదల్లో కొట్టుకుపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. నంబూరు గ్రామం చుట్టూ ఉన్న బ్రిడ్జిలను వెంటనే హై లెవెల్ బ్రిడ్జిల కింద నిర్మాణం జరపాలని, దీనివలన ప్రాణ నష్టాని నివారించవచ్చు అన్నారు. గుంటూరు ఛానల్ పనులు సకాలంలో చేయకపోగా నాసిరకంగా చేయటతోనే గొల్లమూడి, నంబూరు, ఉప్పలపాడు, తక్కళ్ళపాడు మరి ఇతర దిగువ గ్రామాల పొలాలు ముంపునకు గురయ్యాయి అన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో పలు సార్లు స్థానిక అధికారు లకు గోళ్లమూడి లాకులు, కాల్వకట్పుటల పటిష్టతపై అర్జీలు ఇచ్చినప్పటికీ వాటిని పట్టించుకోకపోవడం కూడా ఒక కారణమన్నారు. ఇప్పటికే రైతులు రెండుసార్లు ఎకరానికి రూ.పదివేల ఖర్చుతో పెట్టుబడి పెట్టామని మూడవసారి కూడా వర్షం తమపై తీవ్ర ప్రభావం చూపించిందని, ఎకరానికి రూ.20 నుండి 35 వేల కౌలు చెల్లించి ఇప్పటికే విత్తనాల రూపంలో రూ. 20వేల పెట్టుబడి పోగొట్టు కున్నామని కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేశారన్నారు. పెదకాకాని గ్రామంలో మురుగు చెరువు తెగి మంచినీటి చెరువులో పూర్తిగా మురుగునీరు వచ్చి చేరిందని, ఆ నీటిని వెంటనే పూర్తిస్థాయిలో మోటర్లతో తొలగించాలన్నారు. చెరువు కట్టలను పటిష్టం చేసి మురుగు నీరు వెళ్లడానికి మరొక మార్గం గుంటూరు ఛానల్ కు రెగ్యులర్ గా గుర్రపు డెక్క, తూటుకాడ తొలగించాలని కాలువల పూడిక తీసి కాలువ గట్లను వెడల్పు చేయాలన్నారు. మండలంలో పేదలు నివసించే కాలనీలు జలమయమయ్యాయని, తాగునీరు కలుషితం అయ్యిందని, వెంటనే అధికారులు స్పందించి నీటి ఇంజన్ల ద్వారా తోడించాలని, అంటు వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.



గొల్లమూడి లాకులను, వరద ముంపు ప్రాంతాలను, కల్వర్టులను పరిశీలిస్తున్న సిపిఎం బృందం నాయకులు



శాంతయ్య, రైతు



శ్రీధర్, రైతు

## పలువురు రైతులు ఆవేదన

సిపిఎం బృందం నాయకు లకు పలువురు రైతులు తమ ఆవేదనను తెలిపారు. పెదకాకాని మండలం ఉప్పలపాడుకు చెందిన వల్లభాపురం శ్రీధర్ మాట్లాడుతు 25 ఎకరాలు కౌలుకు తీసుకుని వరి వేశానని, గతంలో వెదవరి పూర్తిగా దెబ్బ తిన్నదని తెలిపారు. అధిక వర్షాల కారణంగా రెండవ సారి పంట వేసినా మొత్తం మునిగి పోయిందని చెప్పారు. అదే గ్రామానికి చెందిన మరో కౌలు రైలు శాంతయ్య మాట్లాడతు 26 ఎకరాలు పంట వేశానని రూ.36వేలు ఎకరాకు కౌలు చెల్లించినట్లు చెప్పారు. పంట మొత్తం నీట మునిగిందని పరిస్థితి ఆగమ్యగోచరంగా ఉందని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు.

# డ్రెయినేజీ వ్యవస్థను పటిష్టపరచి ముంపు నుండి పొలాలను కాపాడాలి : సిపిఎం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ప్రకృతి వైపరీత్యాలు సంభవించి, అకాల భారీ వర్షాలు కురిసినప్పుడు పంట పొలాలు ముంపునకు గురికాకుండా డ్రైనేజీ వ్యవస్థను పటిష్ట పరచాలని సిపిఎం సీనియర్ నాయకులు దొంతి రెడ్డి వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత మూడు రోజులుగా కురుస్తున్న అకాల భారీ వర్షాలకు ముంపునకు గురైన పంట పొలాలను గురువారం సిపిఎం నాయకులు ఎంటిఎంసి పరిధిలోని చిర్రావూరు గ్రామంలో పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ డ్రైనేజీ బోర్డు వారి నిర్లక్ష్యం కారణంగానే పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయని విమర్శించారు. ఎప్పటికప్పుడు పంట పొలాలలో నిలిచిన వ్యర్థపు మురుగునీరు బయటకు పోకుండా నిల్వ ఉండడం వలన వర్షాలు పడినప్పుడు పంట పొలాలు ముంపుకు గురవుతున్నాయని అన్నారు. పొలాలు పక్కన తీసిన డ్రైనేజీ కాలువ పూడుకుపోవడం వలన రైతుల వైరుధ్యాలు తలెత్తుతున్నాయని అన్నారు. లక్షల రూపాయల పెట్టుబడులు పెట్టిన రైతాంగం పంటలు పాడై, భారీగా నష్టాన్ని చవిచూస్తున్నారని ఆయన ఆవేదన చెందారు. తక్షణమే ఇప్పటికైనా డ్రైనేజీ బోర్డు తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ మాట్లాడుతూ ఈ ఏడాది తొలకరి తరువాత వరి నాటు వేసిన తర్వాత రెండవసారి అకాల భారీ వర్షాలు కురవడం రైతులు కౌలు రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారని అన్నారు. చిర్రవూరు ప్రాంతంలో వరి వేసిన రైతులు ఒక్కో ఎకరానికి రూ.15000 నుండి 20 వేల వరకు ఖర్చు చేశారని అన్నారు. ఆంధ్ర రత్న పంపింగ్ స్కీం పంట కాలువ సరిగా పూడిక తీయకపోవడం మురుగు నీరు కూడా వర్షాలు కురిసినప్పుడు పొలాల్లోకి ప్రవహిస్తుందని అన్నారు. పొలాలు చౌడు భూములుగా మారి పంటలు దిగుబడులు తగ్గి, రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. సంబంధిత అధికారులు పంట పొలాల డ్రైనేజీ వ్యవస్థను పటిష్టపరిచి, పొలాలు ముంపుకు గురి కాకుండా డ్రైనేజీ వ్యవస్థను పునర్మించాలన్నారు. కార్యక్రమంలో చిర్రావూరు గ్రామ సిపిఎం నాయకులు పల్లపాటి సుబ్బారావు, రైతులు పోకల శివ నాగేశ్వరరావు, అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి, మేడూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



చిర్రావూరిలో ముంపు పొలాలను పరిశీలించిన సిపిఎం నాయకులు

## నల్లపాడు చెరువును అభివృద్ధి చేస్తాం : పెమ్మసాని

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో తాగునీటి సమస్య పరిష్కారం కోసం నల్లపాడులో చెరువును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ గురువారం మీడియాకు తెలిపారు. నల్లపాడు ట్యాంక్ (తెలగమాంబ చెరువు) పునరుద్ధరణ మరియు తాగునీటి వసతుల అభివద్ధి కోసం గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు బాధ్యత అప్పగిస్తూ ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. గుంటూరు పరిధిలోని విలీన గ్రామాలకు తాగునీటి సమస్య పరిష్కారం కోసం ఈ చెరువు ఉపయోగపడుతుందన్నారు. చెరువు పునరుద్ధరణతో భూగర్భ జలాల నిల్వలు మెరుగుపడి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతుందన్నారు. మొత్తం 79.47 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువు, ప్రస్తుత సాగు అవసరాలు కొనసాగిస్తూ, చుట్టూ వాకింగ్ ట్రాక్ అలాగే పార్కు అభివద్ధి చేస్తామన్నారు.

## కార్మికశాఖ జాయింట్ కమిషనర్‌గా ఆషారాణి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



కార్మిక శాఖ గుంటూరు జాయింట్ కమిషనర్‌గా సిహెచ్ ఆషారాణి నియమితులయ్యారు. ఈమేరకు కార్మిక శాఖ కమిషనర్ ఎం.వి.శేషగిరిబాబు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కార్మికశాఖలో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆమెను పదోన్నతిపై జాయింట్ కమిషనర్‌గా నియమించారు. కార్మిక శాఖలో అసిస్టెంట్ కమిషనర్ నుంచి వివిధ హోదాల్లో పలు జిల్లాల్లో ఆమె పనిచేశారు.



సచివాలయంలో వినతిపత్రం ఇస్తున్న ప్రజలు, సిపిఎం నాయకులు

## ప్రజలను నిలువు దోపిడీ చేసే స్మార్ట్ మీటర్లు మాకొద్దు

ప్రజాశక్తి-గుంటూరు : ప్రజల్ని నిలు వునా దోచుకునే స్మార్ట్ మీటర్లు మాకొద్దు అంటూ స్థానిక స్వర్ణభారతి నగర్, ఇద్వా నగర్ ప్రజలు 178వ వార్డు సచివాలయంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపియం స్థానిక శాఖ కార్యదర్శి జి.లూదర్‌పాల్ మాట్లాడుతూ ఇప్పటికే పెరిగిన కరెంటు చార్జీలతో ప్రజలు సతమతమవుతుంటే, మరింత దోచుకోవటానికి స్మార్ట్ మీటర్లు తేవటం అన్యాయం అన్నారు. స్మార్ట్ మీటర్లు పెట్టుకోకపోతే పథకాలు అందవని బెదిరించి, మోసపూరితంగా బిగించే ప్రయత్నం చేస్తున్నారని, వీటిని తిప్పికొట్టాలన్నారు. అదానీకి లాభాలు చేకూర్చటానికే ప్రభుత్వాలు స్మార్ట్ మీటర్లు తెచ్చాయ న్నారు. తక్షణమే బిగించిన మీటర్లను తీసి, పాత మీటర్లు బిగించాలని డిమాండ్ చేశారు. ట్రూఅప్ చార్జీలు, ఇంధన సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని కోరారు .కార్యక్రమంలో కార్యదర్శి ఆది నికల్సున పాల్గొన్నారు.

## కొండవీటి వాగుకు కొనసాగుతున్న వరద ఉధృతి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి మండలంలో వరద ఉధృతి గురువారం కూడా కొనసాగుతుంది. నీరుకొండ వద్ద కొండవీటి వాగు వరద వంతెనను తాకగా సాయంత్రానికి కాస్త తగ్గుముఖం పట్టినా ఉధృతి కొనసాగుతూనే ఉన్నది. మంగళగిరి ప్రాంతంలో వర్షం అధికంగా నమోదయింది. 1976 నుండి నేటి వరకు పరిశీలిస్తే... మంగళ బుధవారాల్లో పడిన వర్షం అత్యధికంగా నమోదులో మూడో స్థానంలో నిలిచింది. వర్షపాతం 1978 ఆగస్టు 22న 226.1 మి.మీ. అత్యధికంగా నమోదు కాక, రెండవది 1980 జూలై 31న 213.6 మి.మీ. కాగా మంగళ బుధవారం లలో కురిసిన వర్షపాతం 194.8 మి.మీ.గా నమోదైనట్లు అధికారులు తెలిపారు. కాగా ఈ వర్షపాతం వల్ల రాజధాని గ్రామాల్లో వరద నీరు బీభత్సంగా వచ్చి చేరింది. పై నుండి వస్తున్న వరద నీరుతో కొండవీటి వాగు ఉధృతి కొనసాగుతూనే ఉండగా శివారు కాలనీలలో వర్షపు నీరు ఇంకా నిలిచి ఉన్నాయి. నీరుకొండ, కురగల్లు, బేతపూడి గ్రామాల్లో వరదనీటి ప్రవాహం కనిపిస్తున్నాయి. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ చుట్టూ, అమత యూనివర్సిటీ చుట్టూ వరద నీరు చేరింది. ఎటు చూసినా వరద నీరు కనిపిస్తూనే ఉన్నది. చినకాకాని దీన్ దయాల్ కాలనీ వరద నీటిలో ఉండగా మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు వరద నీటిని పక్కకు మళ్లించే చర్య చేపట్టారు. మురుగునీరు వెళ్ళేందుకు గల కాలువ నుంచి నీటిని మళ్లిస్తున్నారు. ఆత్మకూరు శివారు కాలనీలలో నీరు ఇళ్లలోకి వచ్చి చేరడంతో అధికారుల చర్యలు చేపట్టారు. వారికి భోజన వసతిని కల్పిస్తున్నారు. మంగళగిరి తాహశీల్దార్ అధికంగా ఉన్న నీరుకొండ, కురగల్లు ప్రాంతాలను పరిశీలించారు. స్థానిక ప్రజలకు తగు సూచన చేసి జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు.






## కృష్ణానది ఉగ్రరూపం

**నీట మునిగిన పంట పొలాలు**

ప్రజాశక్తి- తాడేపల్లి

శ్రీశైలం, నాగార్జునసాగర్ నుండి వరద నీరు విడుదల చేయటంతో ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణానది ఉగ్రరూపం దాల్చింది. తాడేపల్లి, తుళ్లూరు మండలాల్లోని నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న రైతుల పంట పొలాలు నీట మునిగాయి. తాడేపల్లి ఎమ్మార్వో డి సీతారామయ్య గురువారం సీతానగరం, ఉండవల్లి, ముఖ్యమంత్రి నివాసముంటున్న ప్రాంతాల్లో పర్యటించారు. నీట మునిగిన పంట పొలాల్లోకి రైతులు, కౌలు రైతులు ఎవరు ఎల్లవద్దని సూచించారు.



మత్స్యకారులు చేపల వేటకు నదిలోకి వెళ్ళవద్దని చెప్పారు. ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కోవటానికి రెవెన్యూ సిబ్బంది సిద్ధంగా ఉండాలని కోరారు. కరకట్ట బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో వీఆర్ఏలు, వీఆర్ వోలు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించి తెలియజేయాలని కోరారు.



# స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన పల్నాడు కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

79 వ స్వాతంత్ర్యదినోత్సవాన్ని పురస్కరించుకొని పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుటలోని కలెక్టరేట్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సంబంధించి ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు పల్నాడు జిల్లా ఎస్.పి. కె. శ్రీనివాసరావుతో కలసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేజి ఏర్పాటు, విఐపి, వివిఐపి గ్యాలరీ, స్టాల్‌ల ఏర్పాట్లను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ఆహార-పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ప్రసంగిస్తారన్నారు. పోలీసు, ఎన్.సి.సి. దళాలచే గౌరవ వందనం, మువ్వన్నెల బెలూన్లు ఎగురవేయుట, స్వాతంత్ర్య సమరయోధులకు సన్మానం, ప్రభుత్వ శాఖలచే శకటముల ప్రదర్శన విద్యార్థినీ విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఉంటుందన్నారు. విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన వారికి ప్రశంసాపత్రాలు జ్ఞాపికలు ప్రదానం చేయడం జరుగుతుందన్నారు. వివిధ శాఖలకు చెందిన స్టాల్స్ సందర్శన అనంతరం జాతీయ గీతాలాపనతో కార్యక్రమం ముగుస్తుందన్నారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

## నేడు డ్రైడే పాటించాలి : ఎక్సైజ్ సిఐ

ప్రజాశక్తి-ఈపూరు



స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మద్యం దుకాణాల లైసెన్స్ దారులు డ్రైడే పాటించాలని ఎక్సైజ్ సిఐ డి.వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. ఈపూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఈపూరు, రొంపిచర్ల, బల్లాపల్లి మండలాలలోని మద్యం దుకాణాలను మూసి వేసేలా ఆదేశాలు జారీ చేసినట్లు సిఐ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం దుకాణం నిర్వహించడం, విక్రయించడం, కొనుగోలు చేసేవారిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

## నేడు ఉచిత మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

స్థానిక సాయి కృష్ణ కఅష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సత్తెనపల్లి వారి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు డాక్టర్ సాయికృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వాతంత్ర దినోత్సవాన్ని ని పురస్కరించుకొని ఈ ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శిబిరంలో కార్డియాలజీ, పల్మనాలజీ, జనరల్ మెడిసిన్, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, ఎముకలు మరియు కీళ్ళ విభాగలకు సంబందించిన విశేష అనుభవం ఉన్న ప్రముఖ వైద్య నిపుణులు సేవలు అందించేదరని పేర్కొన్నారు. ఈ గొప్ప అవకాశాన్ని సత్తెనపల్లి పట్టణ, పరిసర గ్రామాల ప్రజలు వినియోగించుకోవాలిని డాక్టర్ సింగరాజు సాయి కృష్ణ, డాక్టర్ సింగరాజు విద్య కోరారు. వివరాలకు ఫోన్ నంబర్స్: 08641 234555, 9932374 555 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

## ప్రజాస్వామ్యం గెలిచింది : యాగంటి

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

పులివెందులలో మూడు దశాబ్ధాల తరువాత ప్రజాస్వామ్యం గెలిచిందని మాచర్ల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. పులివెందుల, ఒంటిమిట్ట స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి విజయకేతనం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. చాలా కాలం తర్వాత ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకొనే అవకాశం రావటంతో కసిగా ఓట్లు వేసి వైసీపీకి డిపాజిట్లు కూడా కాకుండా చేశారని ఎద్దేవా చేశారు.

## నేడు స్త్రీ శక్తి పథకాన్ని ప్రారంభించనున్న ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి

ప్రజాశక్తి - మాచర్ల

సూపర్ సిక్స్‌లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు 15 నుంచి మహిళలకు బస్సులలో ఉచిత ప్రయాణంనకు సంబంధించి సీఎం చంద్రబాబు స్త్రీ శక్తి పథకాన్ని ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో మాచర్లలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి స్త్రీ శక్తి పథకాన్ని కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై పథకాన్ని ప్రారంభిస్తారని డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి గురువారం తెలిపారు.



వరద తీవ్రతను పరిశీలిస్తున్న తహశీల్దార్ ప్రవీణ్

## తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - బెల్లంకొండ

కృష్ణానది తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక తహశీల్దార్ టి.ప్రవీణ్. గురువారం సూచించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాల వల్ల నీటి జలాల మట్టం ప్రాజెక్టులో అధికంగా పెరుగుతుందని, తద్వారా కృష్ణానది ఎక్కువ ప్రాంతానికి ఎక్కువ శాతం నీటిని విడుదల చేస్తారని, పరివాహక ప్రాంతంలో ఉండే ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పులిచింతల ప్రాజెక్టు పరిధిలోని ఎమ్మాజీగూడెం, గోపాలపురం, కొండ ఎత్తున ఉన్న చిట్యాల ప్రజలు వద్దకు వెళ్లి అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## ఉప ఎన్నికల్లో కూటమి విజయం పట్ల ఎమ్మెల్యే అరవిందబాబు హర్షం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వైఎస్ఆర్ కడప జిల్లా పులివెందుల, ఒంటిమిట్ట నియోజకవర్గాలలో ఇటీవల జరిగిన జడ్.పి.టి.సి ఉప ఎన్నికల్లో కూటమి విజయం సాధించడం పట్ల ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు హర్షం వ్యక్తం చేశారు. గురువారం నరసరావుపేట టిడిపి నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ 30 ఏళ్లగా పులివెందుల, ఒంటిమిట్టలో ప్రత్యర్థులు నామినేషన్ వేసే పరిస్థితి లేదని, వైసిపి వర్గీయులు నామినేషన్ వేయడమే కూటమి ప్రభుత్వం పారదర్శకంగా, ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు నిర్వహించిందనడానికి నిదర్శనమన్నారు. వైసిపి నాయకులు మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అనవసర విమర్శలు చేయడం సరికాదన్నారు. అనంతరం నియోజకవర్గ ప్రజలకు స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు



మాట్లాడుతున్న డాక్టర్ రామచంద్రారెడ్డి

## వైసిపికి అంతిమయాత్ర తప్పదు : కాంగ్రెస్

ప్రజాశక్తి - మాచర్ల :

మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల గురించి వాడిన భాష దివాలా కోరుగా ఉందనీ, రాబోయే రోజుల్లో వైసిపికి అంతిమయాత్ర తప్పదని మాచర్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసిపి నాయకులు ఎన్నెన్నో దారుణాలు ఒడిగట్టారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజలు, ప్రతిపక్షాలు ఎన్నటికీ మర్చిపోరన్నారు. బిజెపి ఎన్నికల కమిషన్ కలిసి చేస్తున్న ఓట్ల దొంగతనంపై రాహుల్ గాంధీని తప్పు పట్టడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో కేంద్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వాలేనన్నారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొడ్డా శ్రీనివాసరావు, గాదె పుల్లారెడ్డి, కొమ్ము కోటేశ్వరరావు, వంగపాటి నాగరాజు, నాయకులు నారాయణ రెడ్డి, బ్రహ్మా రెడ్డి, వెంకటరెడ్డి, నాజర్ వలి తదితరులు పాల్గొన్నారు.

## ఈ-పాస్ ద్వారానే ఎరువులు విక్రయించాలి



నీట మునిగిన పత్తి పొలాలను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఈ పాస్ ద్వారానే ఎరువులు విక్రయించాలని పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు సోసైటీల అధ్యక్షులకు సూచించారు. సత్తెనపల్లి మండలంలోని పిఎసియస్, జీడిఎంయస్, రైతు సేవా కేంద్రాల్లో జిల్లా వ్యవసాయ అధికారి గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పాస్‌కు ఎరువుల నిల్వలకు వ్యత్యాసం ఉంటే ఎరువుల అమ్మకాలు నిలుపుదల చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ పాస్‌లో రైతుల ఆధార్ వివరాలు నమోదు చేయాలని సూచించారు. సత్తెనపల్లి ఏడిఎ బి.రవిబాబు, ఏవో సుబ్బారెడ్డి ముప్పాళ్ళ ఏవో శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గన్నారు.

**నీటమునిగిన పత్తి పొలాల పరిశీలన**

సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామంలో వర్షాలకు నీట మునిగిన పత్తి పొలాలను జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు పరిశీలించారు. రైతులనుండి వివరాలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిల్వ ఉన్న వర్షపు నీటిని బయటకు పంపించి ఎకరానికి 20కేజీల యూరియా, 10 కేజీల పోటాష్ ఎరువులు వెద చల్లుకోవాలని రైతులకు వివరించారు. ఏడిఎ రవిబాబు, ఏవో సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు సలహాలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని మాచర్ల అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ వి.జగదీశ్వర్‌రెడ్డి కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాచర్లసబ్ డివిజన్ పరిధిలో ఈనెల 12, 13 తేదీల్లో కురిసిన భారీ వర్షానికి పత్తి పండించే ప్రాంతాల్లో నీరు నిలిచిపోయిందని,ఈ పరిస్థితి లో రైతులకు పలు సూచనలు సలహాలు చేశారు. పత్తి పంట లో అధిక తేమ కారణంగా కాయ కుళ్లిపోవడం, లింట్ దెబ్బతినే అవకాశం ఉందని, పువ్వు, కాయ రాలడం జరుగుతుందన్నారు.



వ్యవసాయ అధికారి జగదీశ్వర్ రెడ్డి

## 300 అడుగుల జెండాతో ర్యాలీ

ప్రజాశక్తి - కారంపూడి

పట్టణంలో గురువారం 300 అడుగుల మువ్వన్నెల జెండాతో స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారుల ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుండి మెయిన్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. భారతీయ మువ్వన్నెల జెండా గొప్పతనం అందరికీ తెలిసేలా కేంద్ర ప్రభుత్వం 'హర్ ఘర్ తిరంగా' ప్రచార కార్యక్రమాన్ని చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి భారతీయుడిపైనా ఉందని పేర్కొంది. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్, ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఐ వాసు, టిడిపి మండల అధ్యక్షుడు సురేష్ యాదవ్, మాజీ అధ్యక్షుడు లక్ష్మి నారాయణ, జనసేన సమన్వయ కర్త రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

## పేరుకుపోయిన చెత్త.. పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - నాదెండ్ల

పారిశ్రామిక వాడగా పేరున్న గణపురం గ్రామంలో చెత్త పేరుకు పోయి దుర్గంధం వెదజలుతోంది. గణపవరం నడిబొడ్డులో, నాలుగు రోడ్ల కూడలిలో ఎక్కడి చెత్త అక్కడే పేరుకు పోయింది. ఆ మార్గంలో వెళ్లే ప్రయాణికులు వాహనదారులు విద్యార్థులు చెత్త కంపు కొడుతుందని వాపోతున్నారు. చెత్త పడేసి వాహనాలు ఉన్నప్పటికీ చెత్త నిలువలు ఎందుకుంటున్నాయని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఈ వర్షాలకు ఈ చెత్త వలన దోమకాట్లు ప్రభలే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి. పరిసరాల పరిశుభ్రతను పాటించాలని. గ్రామస్తులు వేడుకుంటున్నారు.



పేరుకుపోయిన చెత్త

## మిర్చి రైతులు 31లోగా బీమా చేయించుకోవాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మిరప పంట సాగు చేసే రైతులకు ఈనెల 31వ తేదీలోగా బీమా చేయించుకోవాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఐ.వెంకట్రావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తుఫానులు, కరువు, అకాల వర్షాలు వంటి ప్రకఅతి వైపరీత్యాలతో పంట దిగుబడి నష్టపోయిన రైతులకు ఆర్థిక సహాయం అందించడం , వాతావరణ అంశాల ఆధారంగా సంభవించిన పంట నష్టాన్ని అంచనా వేసి బీమా పరిహారం చెల్లిస్తామన్నారు. ఎంపిక చేసిన పంటలను సాగు చేస్తూ నిర్ణీత సమయంలో ప్రీమియం చెల్లించి నమోదు చేసుకున్న కౌలు రైతులతో సహా రైతులందరూ ఈ బీమా పథకంలో చేరడానికి అర్హులన్నారు. వాస్తవ ప్రీమియంలో రైతు చెల్లించగా మిగిలిన మొత్తాన్ని బీమా కంపెనీలకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నేరుగా చెల్లిస్తాయన్నారు. పల్నాడు జిల్లాలో ఈ పథకం అమలకు ఫ్యూచర్ జనరల్ బీమా కంపెనీ ఎంపిక చేయబడిందని మిరప సాగు చేసే రైతులు ఒక ఎకరానికి రూ 360/-ప్రీమియం చెల్లిస్తే రూ 90 వేలు భీమా వర్తిస్తుందన్నారు. నిర్దేశిత గడువులోగా బ్యాంకులో సమర్పించాలన్నారు. బీమా మంజూరైన సందర్భంలో సంబంధిత బ్యాంకు రుణం ఖాతాకు బ్యాంకు వారి ద్వారా పరిహారం చెల్లించబడుతుందన్నారు. పంట ధ్రువీకరణ పత్రం, బ్యాంకు వివరాలకు సంబంధించిన పత్రాలు సమర్పించి ఆన్లైన్ ద్వారా ప్రీమియం చెల్లించి రసీదు పొందవచ్చన్నారు.



జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఐ. వెంకట్రావు



దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

## 254వ రోజుకు ఎసిసి కార్మికుల దీక్షలు

**ప్రజాశక్తి - తాడేపల్లి**

చట్ట ప్రకారం తమకు రావలసిన రకాలు కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు గురువారం నాటికి 254వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను సిఐటియు నాయకులు వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కె.స్టీవెన్, వై.సాంబయ్య ప్రారంభించారు. దీక్షలో ఎన్ సుబ్బారావు, సిహెచ్. పిచ్చయ్య, కె.హగ్గయ, డి.నాగేశ్వరరావు, షేక్ ఖాశిం కూర్చున్నారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు వేముల దుర్గారావు, యూనియన్ నాయకులుకూరపాటి స్టీవెన్ మాట్లాడుతూ 254 రోజులుగా ఏసీసీ కార్మికులు పోరాడుతున్న నేటికీ పాలకవర్గాలు స్పందించకపోవడం చాలా అన్యాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో డి.మాణిక్యరావు, వై.సాంబశివ రావు, రమాదేవి, హిమాంబి, చారమ్మ, మల్లీశ్వరి, ఇస్మాయిల్, రిబ్కా, శివమ్మ పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**ప్రజాశక్తి - తెనాలి**

పురపాలక సంఘం పరిధిలోని 4వ వార్డు బీసీ కాలనీలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి గురువారం మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డుల వారీగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. అంతర్గత సిమెంటు రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి పనులు ప్రారంభమయ్యాయన్నారు. దానిలో భాగంగా 13 లక్షల అంచనా వ్యయంతో బీసీ కాలనీలో 115 మీటర్ల సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో 4వ వార్డు కౌన్సిలర్ అడుసుమల్లి వెంకటేశ్వరరావు, డిఇ శ్రీనివాసులు, అసిస్టెంట్ ఇంజనీర్ సునీల్ కుమార్, వార్డు ప్రజలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



డెల్టా కాలవలకు పూర్తిస్థాయిలో నిలిపివేసిన సాగునీటి సరఫరా

## కాల్వలకు నీటి సరఫరా నిలిపివేత

**ప్రజాశక్తి - దుగ్గిరాల**

కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలో కురిసిన అకాల వర్షాలకు నీట మునిగిన పంట పొలాలలో నీరు బయటకు పంపించేందుకు డెల్టా పరిధిలోని ప్రధాన కాలువ బకింగ్ హామ్ కెనాల్‌తో పాటు అన్ని కాలువలకు నీటి సరఫరా గురువారం పూర్తిస్థాయిలో నిలిపివేశారు. డెల్టా చివరి భూములైన ప్రకాశం జిల్లా లోని స్వర్ణ ఇంకొల్లు, యద్దనపూడి, సంతనూతలపాడు, కారంచేడు మండలాల్లో అధిక వర్షపాతం నమోదవడంతో డెల్టా పరిధిలోని అన్ని కాలు వల నీటి సరఫరా పూర్తిస్థాయిలో నిలిపివేశారు. పంట చేలలో నీరు పూర్తి స్థాయిలో తగ్గిన తర్వాత రైతుల అవసరాల మేరకు సరఫరా చేస్తారని జల వనరుల శాఖ అధికారులు తెలిపారు.

## నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

**ప్రజాశక్తి - తాడికొండ**

భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులందరికీ ప్రభుత్వం వెంటనే సాయం అందించాలని రైతు సంఘం మండల కార్యదర్శి చింతల భాస్కరరావు గురువారం ప్రభుత్వాన్ని కోరారు. 15 గ్రామాలలోని పంటలు దెబ్బతిన్నాయని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులని ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

**ప్రజాశక్తి - పెదకాకాని**

ఆటో కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో ఆటో కార్మికులు పెదకాకాని తహశీల్దార్‌కి గురువారం మెమోరాండం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలిండియా రోడ్డు ట్రాన్స్ పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు నన్నపనేని శివాజీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలని శివాజీ డిమాండ్ చేశారు. ఉన్నత చదువులు చదువుకొని ఉద్యోగాలు లేక నిరుద్యోగులు అనేక మంది వ్యవసాయం లాభసాటి లేక యువత ప్రైవేట్ ఫైనాన్సర్ల వద్ద అప్పు చేసిమరియు బ్యాంకుల వద్ద లోను ద్వారా ఆటోలు కొనుగోలు చేసి ప్రతినెలా ఫైనాన్స్ కిస్తీలు చెల్లిస్తూ పిల్లల్ని చదివించు కుంటూ కుటుంబం పోషించుకుంటూ రాష్ట్రంలో సుమారు పది లక్షల కుటుంబాలు స్వయం ఉపాధి పొందుతున్నారు. ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తే ఆటో కార్మికులకు బాడుగలు తగ్గుతాయి కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఆటో కార్మికులకు ఇచ్చిన హామీ అమలు చేయాలి డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న ప్రతి ఆటో కార్మికుడికి వాహన మిత్ర పథకం కింద



తహశీల్దార్‌కి వినతిపత్రం అందజేస్తున్న నన్నపనేని శివాజీ

25000 ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఓలా ఓబర్ కంపెనీలు నడుపుతున్న యాప్ రద్దుచేసి రాష్ట్ర ప్రభుత్వమే యాప్ నిర్వహించాలి. వాహన ఫిట్నెస్ ఏ టి ఎస్ ఆటోమేటిక్ ట్రాకులు ప్రైవేటు వారికి ఇవ్వడం రద్దు చేయాలని వాహన ఫిట్నెస్ ప్రభుత్వమే నిర్వహించాలని, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని జీవో నెంబర్ 21 రద్దు చేయాలని అన్ని రకాల ఫీజులు పెనాల్టీలు తగ్గించాలని లేనిపక్షంలో దశల వారి ఆందోళన చేపడతామని అన్నారు. ఆటో యూనియన్ మండల అధ్యక్షులు కొలికొండ కొండలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు దంటు వెంకటరామిరెడ్డి, తోట సాంబశివరావు, దుర్గం దర్గా బాబు ఎస్.కె.కరీముల్లా, గోపికృష్ణ, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# లోతట్టు ప్రాంతాలను సందర్శించిన కమిషనర్

**ప్రజాశక్తి - మంగళగిరి**

రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మంగళగిరి పట్టణంలోని లోతట్టు ప్రాంతాలైన రత్నాల చెరువు, దీన్ దయాల్ నగర్, ఎన్నారై జంక్షన్, టీక్కో గృహాలను నగరపాలక సంస్థ కమిషనర్ ఆలీం భాష పట్టణ అధ్యక్షులు పడవల మహేష్‌లు గురువారం సందర్శించారు. స్థానికులతో చర్చించి వారి సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కరిస్తున్నామని డ్రైనేజీ పారుదల త్రాగునీరు పైపులైన్లు ప్రతిరోజు క్షుణ్ణంగా పరిశీలిస్తూ ఫాగింగ్. బ్లీచింగ్ పౌడర్ చల్లుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా పడవల మహేష్ మాట్లాడారు. రెండు రోజులకు కురుస్తున్న భారీ వర్షానికి ఇంటిలోకి నీరు చేరి ఇబ్బంది పడుతున్న మేడూరి



ముంపు ప్రాంతాలను పరిశీలించిన కార్పొరేషన్ కమిషనర్ అలీం భాష, టిడిపి పట్టణ అధ్యక్షులు మహేష్

కోటేశ్వరరావు ఇంటి పరిసరాలను పరిశీలించారు. వెంటనే రెండు ట్రాక్టర్ల మట్టిని అందించి సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లుగా తెలిపారు.

# నిర్మల ఫార్మసీ కళాశాలలో సాంస్కృతిక పోటీలు



పోటీలలో పాల్గొన్న విద్యార్థినులు

**ప్రజాశక్తి - మంగళగిరి రూరల్**

79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్మల ఫార్మసీ కళాశాలలో లైబ్రరీ సెల్ ఆధ్వర్యంలో "నేషన్ ఫస్ట్‌బి ఆల్వేస్ ఫస్ట్" అనే థీమ్‌తో దేశభక్తి సాంస్కృతిక పోటీలు ఘనంగా నిర్వహించారు. రోల్ ప్లే, నృత్యం, గానం అనే మూడు విభాగాల్లో మొత్తం 52 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధులను అనుకరించి, వారి త్యాగాలను ప్రతిబింబించగా, దేశభక్తి గీతాలు, నఅత్యాలతో అందరికీ ప్రేరణనిచ్చారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రేవరెండ్ సిస్టర్ జి. నిర్మల జ్యోతి, ప్రిన్సిపాల్ డాక్టర్ బి. పాముల రెడ్డి విజేతలను అభినందిస్తూ స్వాతంత్ర్య దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ జి. స్వప్న, డాక్టర్ పి. లక్ష్మయ్య, డాక్టర్ యూ. స్పందన, డాక్టర్ కె. సౌజన్య, జి. సాయి శ్రీలక్ష్మి, డా. ఎస్. పద్మావతి, డాక్టర్ ఎం. సుధీర్, డాక్టర్ షేక్. ఫైజాన్ అలీ, డాక్టర్ హరేకఅష్ణ రాయ్, డాక్టర్ కె. నాగరాజు, జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రేఖా నరేష్ బాబు, లైబ్రరీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# జాతీయతపై ప్రజల్లో అవగాహన పెరగాలి




హర్ ఘర్ తిరంగా ర్యాలీని ప్రారంభించిన కమిషనర్

**ప్రజాశక్తి - మంగళగిరి**

జాతీయతని ప్రజల్లో అవగాహన కల్పించేందుకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ అలీం భాష అన్నారు. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగరవేసి ప్రతి ఒక్కరు జాతీయతను చాటుకోవాలని పిలుపునిచ్చారు. మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద గురువారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, నిర్మల కాలేజీ డైరెక్టర్ వివి ప్రసాద్, మున్సిపల్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, శ్రీ నలంద ఒకేషనల్ జూనియర్ కాలేజీ, డి జె డి అండ్ డి ఎల్ పి డిగ్రీ కాలేజీ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. తొలుత కమిషనర్ ఆలీం భాష హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని జండా ఊపి ర్యాలీని ప్రారంభించగా మున్సిపల్ కార్యాలయం నుండి గౌతమ బుద్ధ రోడ్డు మీదగా ర్యాలీ జరిగింది.

### ముమ్మరంగా స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లు

**ప్రజాశక్తి - దుగ్గిరాల**

స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు గురువారం నుండి ముమ్మరంగా ఏర్పాటు ప్రారంభించారు. జాతీయ జెండా ఎగురవేసే స్తంభాలకు జాతీయ జెండా రంగులు వేయించారు. స్థానిక పంచాయతీ కార్యాలయాన్ని మూడు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా గ్రామానికి చెందిన స్వచ్ఛంద సేవా సంస్థ దోస్త్ మరియు స్థానిక ఇన్సాన్ గ్యాస్ ఏజెన్సీస్ వారి ఆధ్వర్యంలో 500 జాతీయ జెండాలు గ్రామంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మిక్కిలినేని గాంధీ, గూడూరు వెంకటరావు, గద్దె శ్రీనివాస్, కాసరనేని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



దుగ్గిరాలలోని సుగాలి కాలనీలో పర్యటించిన అధికారులు

## సురక్షిత ప్రాంతాలకు వెళ్లండి

**ప్రజాశక్తి - దుగ్గిరాల**

కనీవిని ఎరుగని రీతిలో వర్షాలు కురుస్తున్నందున లోతట్టు ప్రాంతంలో ఉండే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని తహశీల్దార్ ఐ.సునీత ప్రజలకు సూచించారు. శిథిలావస్థలో ఉన్న గోడలు పాత భవనాలలో ఉండవద్దని సలహాని ఇచ్చారు. గురువారం మండల పరిధిలో జలమయమైన ప్రాంతాలను ఆమె పరిశీలించారు. వీర్లపాలెం, పెద్ద కొండూరు ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో 8500513573 నంబర్ గల ఫోన్‌కు సంప్రదించాలన్నారు. సర్పంచ్ బాణావత్ ఖుషి భాయ్ ఆధ్వర్యంలో లోతట్టు ప్రాంతాలలోని నీటిని ఇంజన్‌తో తోడించారు. నీరు తగ్గిన అనంతరం బ్లీచింగ్ చెల్లిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఈ శ్రీనివాసరావు గ్రామ కార్యదర్శి కె.వివేకానంద మరియు రెవెన్యూ పంచాయతీరాజ్ సిబ్బంది పాల్గొన్నారు.



పారిశుద్ధ్యం, సమీత్వ రీ సర్వే ను పరిశీలిస్తున్న డిపిఓ

## రీ-సర్వేను పరిశీలించిన అధికారులు

**ప్రజాశక్తి - చేబ్రోలు**

మండలంలోని నారాకోడూరు గ్రామపంచాయతీలో పర్యటించిన జిల్లా పంచాయతీ అధికారి బి.వెంకటనాగ సాయి కుమార్ గ్రామంలో జరుగుతున్న ఇంటింటి ఘన వ్యర్థాల సేకరణను మరియు గ్రామంలో జరుగుతున్న సమీత్వ రీ సర్వే ను ఆయన పరిశీలించారని పంచాయతీ కార్యదర్శి ఎస్కె అబ్దుల్ అజీజ్ తెలిపారు. ప్రతి ఇంటి నుంచి చెత్తను వేరు చేసి ఇచ్చే విధంగా పంచాయతీ సిబ్బంది మరియు క్లాత్ మిత్రాలు ప్రజలకు నిరంతరం చెబుతూ ప్రచారం ఉండాలని సూచించారు. గ్రామంలో విమర్శలకు అవకాశం లేకుండా స్థలం కొలతలను సక్రమంగా సమర్థవంతంగా ఈ సర్వే ద్వారా నిర్వహించాలని సిబ్బందికి సూచనలు చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సర్పంచ్ వెలగా సాంబశివరావు , పంచాయతీ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కాంట్రాక్టర్లకు విత్ హెల్డ్ పేమెంట్స్ చెల్లింపు

**ప్రజాశక్తి - చేబ్రోలు**

కాంట్రాక్టర్లకు విత్ హెల్డ్ పెండింగ్ పేమెంట్స్ చెల్లింపులుపై అధికారులు, కాంట్రాక్టర్లతో గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఎంపిడిఓ ఎ.ఉమాదేవి మాట్లాడుతూ 2014 నుండి 2019 మధ్య కాలంలో పంచాయతీరాజ్, హౌసింగ్, మండల కంప్యూటర్ సెంటర్ (ఎంసిసి) విభాగంలో చేసిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి విత్ హెల్డ్ పెండింగ్ పేమెంట్లను కాంట్రాక్టర్లకు చెల్లిస్తామని ఎంపీడీవో ఉమాదేవి అన్నారు. పెండింగ్ వున్న ఈ విత్ హెల్డ్ పేమెంట్స్ చెల్లింపుల కొరకు కేంద్ర ప్రభుత్వం 4022888 /- లక్షల మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రాంట్ క్రింద విడుదల చేసిందని తెలిపారు. కార్యక్రమంలో ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్ ఏపిడి శివన్నారాయణ, పశుసంవర్థక శాఖ ఏడి సాంబశివరావు, పిఆర్‌ఏఈ, ఎస్.కె ఫిరోజ్ లాల్, టిడిపి నాయకులు మైలా వెంకటరామరాజు, ప్రధాన కార్యదర్శి అనంత లక్ష్మి నారాయణ, హౌసింగ్ సిబ్బంది, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

## ఎంఎస్సీ ఫారెస్ట్రీ పరీక్షా ఫలితాలు విడుదల

**ప్రజాశక్తి - ఎఎన్‌యు**

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలో గత ఏప్రిల్ నెలలో జరిగిన ఎంఎస్సీ ఫారెస్ట్రీ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు పరీక్ష నిర్వహణ అధికారి ఆలపాటి శివప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

## ఇంజినీరింగ్ రెండో కౌన్సెలింగ్ సీట్లు కేటాయించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-గుంటూరు


మాట్లాడుతున్న కిరణ్

ఇంజినీరింగ్ రెండో విడత కౌన్సిలింగ్‌కు సంబంధించిన వెంటనే సీట్లు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ డిమాండ్ చేశారు. గురువారం బ్రాడీపేటలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కౌన్సెలింగ్ నిర్వహించి దాదాపు 20 రోజులు దాటిందన్నారు. జులై 22న తేదీన కౌన్సిలింగ్ ప్రక్రియ ముగిసిందని, నేటికీ సీట్లు కేటాయించలేదన్నారు. ఇప్పటికే మొదటి విడత కౌన్సెలింగ్‌లో సీట్లు పొంది, తరగతులు ప్రారంభం అవటంతో రెండో విడత సీట్ల కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. కేవలం ప్రైవేట్ యూనివర్సిటీల గొంతెమ్మ కోరికలు తీర్చటానికే సీట్ల కేటాయింపు జాప్యం చేస్తూ విద్యార్థులను ఇబ్బంది పెడతున్నారని అన్నారు. ఇటీవల అమరావతిలో ప్రైవేటు యూనివర్సిటీలు ఏపీ సెట్ ద్వారా వచ్చిన విద్యార్థుల్ని తమ యూనివర్సిటీల్లో చేర్చుకోమని ప్రకటించాయని, మరికొన్ని యూనివర్సిటీలు కోర్టు ద్వారా అడ్మిషన్లు ఆపేందుకు ప్రయత్నం చేస్తున్నాయని అన్నారు. ప్రభుత్వం వారిపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. రాజధాని ప్రాంతంలో తక్కువ ధరలకు భూములు తీసుకొని యూనివర్సిటీలు ఏర్పాటు చేసి, విద్యార్థులను చేర్చుకోమని చెప్పటం దారుణమని, ఫీజులు భారీగా చెల్లించే విద్యార్థులకే సీట్లు ఇస్తుండటం సరికాదన్నారు. ప్రైవేటు యూనివర్సిటీలలో విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వాలని లేనిపక్షంలో ప్రైవేటు యూనివర్సిటీలో గుర్తింపును రద్దుచేసి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్.కె.సమీర్, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి ఏ.యశ్వంత్ ఎస్ఎఫ్ఐ నగర ఉపాధ్యక్షులు ఎస్.కె. సుభాని పాల్గొన్నారు.

## విద్యార్థులు ప్రజల స్వరం వినిపించాలి

ప్రజాశక్తి-గుంటూరు


మాట్లాడుతున్న విజయభారతి సయాని

మానవ హక్కులకు భంగం కలిగినప్పుడు బాధితుల తరపున విద్యార్థులు తమ స్వరాన్ని వినిపించాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యులు విజయభారతి సయాని అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ' రోల్ ఆఫ్ ఎన్‌హెచ్ఆర్‌సీ ఇన్ ప్రొటెక్షన్ ఆఫ్ ఫండమెంటల్ అండ్ హ్యూమన్ రైట్స్' అనే అంశంపై జాతీయస్థాయి వర్క్‌షాప్‌ను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ భారతి మాట్లాడుతూ వ్యక్తుల ప్రాణం, స్వేచ్ఛ, గౌరవం, సమానత్వం వంటి మౌలిక హక్కులను కాపాడటంలో ఎన్‌హెచ్ఆర్‌సీ ముఖ్య పాత్ర పోషిస్తుందన్నారు. ప్రభుత్వ సంస్థలు, పోలీసు, ఇతర అధికారుల దుర్వినియోగం వల్ల హక్కులు ఉల్లంఘించబడినప్పుడు బాధితుల నుండి నేరుగా ఫిర్యాదులు స్వీకరించడమే కాకుండా తగిన న్యాయం చేకూరుస్తామన్నారు. హక్కుల రక్షణకోసం కొత్త చట్టాలు, విధానాలు, సంస్కరణలపై ప్రభుత్వానికి సలహాలు కూడా ఇస్తామన్నారు. మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, ఖైదీలు, మైనారిటీల హక్కులను రక్షించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. విజ్ఞాన్స్ చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కుల గురించి విద్యార్థులకు వివరించారు. ప్రతి హక్కు వ్యక్తి స్వేచ్ఛ, సమానత్వం, గౌరవాన్ని కాపాడటానికి ఉద్దేశించబడిందని అన్నారు. అనంతరం లీగల్ లిటెరసీ అండ్ అవేర్‌నెస్ కాంపెయిన్ అండ్ కాంపీటీషన్స్ ఆన్ చైల్డ్ రైట్స్-2025'కి సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పీ.నాగభూషన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కళాశాలలో శనక్కాయల అరుణ బ్లాక్ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు


తరగతి గదుల్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నసీర్, తదితరులు

స్థానిక సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల ఆవరణలో అహల్య చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్, డాక్టర్ శనక్కాయల రాజ కుమారి దంపతులచే మాజీమంత్రి శనక్కాయల అరుణ పేరున రూ.25 లక్షల వ్యయంతో మూడు తరగతి గదులను నిర్మించారు. నూతనంగా నిర్మించిన అరుణ బ్లాక్‌ను తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నజీర్ అహ్మద్ చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఆర్.జోత్స్నకుమారి అధ్యక్షత వహించగా, ఎమ్మెల్యే మాట్లాడుతూ 8 దశాబ్దాల సుదీర్ఘ చరిత్రగల ప్రభుత్వ మహిళ కళాశాలలో చదివిన వేలాది మందిలో రాష్ట్ర మాజీ మంత్రి అరుణ ఆమె కుమారుడు, కోడలు పుట్టినరోజు జ్ఞాపకంగా నూతన తరగతి గదులు కట్టించి ప్రారంభించడం అభినందనీయం అన్నారు. డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్, డాక్టర్ రాజకుమారి మాట్లాడుతూ అధ్యాపకులకు, ఒక ఉచిత మెడికల్ క్యాంపు ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. సందర్భంగా డాక్టర్ శనక్కాయల అరుణ డాక్టర్ శనక్కాయల గౌరీశంకర్ దంపతులను ఎమ్మెల్యే నసీర్, కళాశాల యాజమాన్యం, పూర్వ విద్యార్థుల సంఘం అభినందించాయి. కార్యక్రమంలో కళాశాల అభివద్ధి కమిటీ సభ్యులు ఎస్.నరేంద్ర కుమార్, ఎస్.చందన, స్టూడెంట్ కౌన్సిల్ కన్వీనర్ డాక్టర్ విజయశ్రీ, డాక్టర్ విజయలక్ష్మి పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# వాహనదారులకు ఇక్కట్లే..


కంకరగుంట బ్రిడ్జి ప్రారంభంలో గుంట


బ్రాడీపేట 1/19లో వాహనాల రద్దీ

## ప్రత్యామ్నాయ రోడ్లు గుంతలమయం - కంకరగుంట బ్రిడ్జిపైనా మరమ్మతులకు నోచుకోని గుంతలు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో శంకర్ విలాస్ నూతన బ్రిడ్జి నిర్మాణం నేపథ్యంలో ప్రత్యామ్నాయ రహదారులను ముందుగానే సిద్ధం చేయకపోవటం, ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రోడ్లపై గుంతలు ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదర్కొంటున్నారు. శంకర్‌విలాస్ బ్రిడ్జి లేకపోవటంతో మూడు వంతెనలు, అరండల్‌పేట, బ్రాడీపేట, కోబాల్ట్‌పేట, కుందుల రోడ్డు, లక్ష్మీపురం, బృందావన్ గార్డెన్స్ రోడ్లపై ట్రాఫిక్ రెట్టింపు అయ్యింది. అయితే ఆయా రహదారులను మాత్రం ముందుగా సిద్ధం చేయకుండానే హడావుడిగా ట్రాఫిక్ మళ్లించటంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. గతంలో ఉన్న కొద్దిపాటి గుంతలు పూడ్చకపోవటంతో, పెరిగిన ట్రాఫిక్, వర్షం కారణంగా అవి ఇంకా పెద్దవి అయ్యాయి. మూడు వంతెనెల వద్ద కూడా పెరిగిన రద్దీని తట్టుకునే విధంగా రోడ్లు లేవు. వర్షాలు పడినప్పుడు రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. కంకరగుంట ఆర్‌యుబిలోనూ నీరుచేరి రాకపోకలు నిలిచిపోతున్నాయి. శంకర్ విలాస్ బ్రిడ్జి పూర్తి అయ్యే వరకూ ఇదే పరిస్థితి కొనసాగితే ఇబ్బంది కరంగానే ఉంటుంది. వాస్తవానికి బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం అయిన ఆరు నెలల వరకూ శంకర్ విలాస్ బ్రిడ్జిపై రాకపోకలు అనుమతిస్తామని గతంలో జిల్లా ఉన్నతాధికారులు ప్రకటించారు. కానీ ఒక్క పిల్లర్ నిర్మించక ముందే రాకపోలు ఆపేశారు. దీంతో జిజిహెచ్, కోర్టు, కలెక్టరేట్, మార్కెట్, బైపాస్‌కు వెళ్లే వాహనదారులకు ఇక్కట్లు మొదలయ్యాయి. గుంటూరు పశ్చిమలోని బృందావన్ గార్డెన్స్, రాజేంద్రనగర్, పట్టాభిపురం, లక్ష్మీపురం ప్రధాన రహదారుల్లో సైతం గుంటలు ఏర్పడినా మరమ్మతులపై సత్వరమే స్పందించకపోవటంతో వాహనదారుల్లో అసంతృప్తి వ్యక్తం అవుతుంది. వర్షాలు పడినప్పుడు గుంటలు కనపడక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.


బ్రాడీపేట 18వ అడ్డరోడ్డులో

### బ్రాడీపేటలో సిద్ధం కాని రోడ్లు...

ట్రాఫిక్ మళ్లింపు తర్వాత అమరావతి రోడ్డు నుండి కలెక్టరేట్, కోర్టు, ఏటి అగ్రహారం ప్రాంతాలకు వచ్చే వారు బ్రాడీపేట, లక్ష్మీపురం మీదుగా ప్రయాణిస్తున్నారు. ట్రాఫిక్ మళ్లింపు తర్వాత బ్రాడీపేట 18వ అడ్డరోడ్డు కీలకంగా మారింది. కానీ ఆ రోడ్డు అడుగుకో గుంటతో అధ్వాన్నంగా ఉంది. అనేక చోట్ల అడుగులోతు గోతులు దర్శనమి స్తున్నాయి. ట్రాఫిక్ పెరిగిన తర్వాత కూడా మరమ్మతులు చేపట్టలేదు. శంకర్‌విలాస్ సెంటర్ నుండి బ్రాడీపేట నాలుగో లైన్‌లో 13వ అడ్డరోడ్డు వరకే ఇటీవల తారు రోడ్డు నిర్మించారు. అక్కడి నుండి 19వ అడ్డరోడ్డు వరకూ నిర్మాణం ఆగి పోయింది. దీంతో ఆ రోడ్డుపై కంకర రాళ్లు పైకి వచ్చి రాకపోకలకు ఇబ్బందిగా మారాయి. చిన్న వర్షానికే రోడ్డుపై నీరు చేరి నిలబడుతుంది. బ్రాడీపేట 2వ లైన్‌లో 1 నుండి 17వ అడ్డరోడ్డు వరకే సిమెంట్ రోడ్డు నిర్మించారు. అక్కడి నుండి 18వ అడ్డరోడ్డు వరకూ రోడ్డు అధ్వాన్నంగా ఉంది. దీంతో ప్రయాణికులు ఒకటో లైనులోనే ప్రయాణిస్తున్నారు. అది చిన్నరోడ్డు కావటంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. కంకరగుంట సమీపంలో రోడ్డు విస్తరణ ప్రారంభించినా అది పూర్తి కాలేదు. ఉదయం, సాయంత్రం స్కూళ్లు, కాలేజీలకు, ఆఫీసులకు వెళ్లే వారు సకాలంలో గమ్యానికి చేరుకోలేకపోతున్నారు.


బ్రాడీపేట 4వ లైన్‌లో పూర్తి కానీ రోడ్డు

### కంకరగుంట బ్రిడ్జి గుంతల మయం

పెరిగిన ట్రాఫిక్, ఇటీవల కురుస్తున్న వర్షాలతో కంకరగుంట బ్రిడ్జిపై గుంతలు ఏర్పడ్డాయి. పోలీసు వారు తాత్కాలికంగా కంకర రాళ్లతో వాటిని పూడ్చినా ఉపయోగం లేకుండా పోతుంది. బ్రిడ్జి పైభాగంలోని మధ్యలో కూడా జాయింట్ల వద్ద మరమ్మతులకు గురయ్యింది. ఇవేవీ పూర్తి చేయకుండానే ట్రాఫిక్‌ను మళ్లించటంపై వాహనదారులు అసహనం వ్యక్తం చేశారు. గుంతలకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఆర్‌యుబిలోకి వెళ్లటానికి గతంలో ఉన్న దారితో పాటు బ్రాడీపేట వైపు మరో దారిని కొత్తగా ఏర్పాటు చేశారు. అయితే ఆ ప్రాంతంలో సరైన మార్కింగ్ ఇవ్వకపోవటంతో టిజెపిఎస్ కాలేజి వైపు నుండి ఆర్‌యుబిలోకి వచ్చే వాహనాలు, బ్రాడీపేట నుండి పట్టాభిపురం వైపు వచ్చే వాహనాలు ఎదురెదురుగా రావటంతో ప్రమాదాలు జరుగుతు న్నాయి. బ్రాడీపేట నుండి బ్రిడ్జిపైకి వెళ్లటానికి ఫాతిమా నగర్‌వైపు కాకుండా టిజెపిఎస్ కాలేజి ఎదురుగా బ్రిడ్జి ఎక్కుతున్నారు. దీంతో పట్టాభిపురం నుండి ఎదురు వచ్చే వాహనదారులు ఇబ్బంది పడు తున్నారు.

## చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్వాతంత్య్రదినోత్సవ ర్యాలీలు


గుంటూరు స్వర్ణాంధ్ర నగర్‌లో..

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ట్యూషన్ విద్యార్థులచే గురువారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య నగర్, స్వర్ణాంధ్ర నగర్‌లో స్వాతంత్ర్య దినోత్సవ ర్యాలీలు నిర్వహించారు. పిల్లలు జాతీయ పతాకాలు చేతబట్టి నినాదాలు చేస్తూ కాలనీల్లోని వీధుల్లో ఉత్సాహంగా ర్యాలీ నిర్వహించారు. సుందరయ్య నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజానాట్యమండలి నాయకులు జి.లూదర్‌పాల్ దేశభక్తి గేయాలు ఆలపించారు. ఆది నికల్సన్ పిల్లలకు మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో ట్యూషన్ టీచర్ సుజాత, ముస్తాక్ పాల్గొన్నారు. స్వర్ణాంధ్ర నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులతో దేశభక్తి గేయాలు పాడించి, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ట్యూషన్ టీచర్ శిరీష, లెక్చరర్ ఆర్.స్వాతి, బాలల సంఘం కన్వీనర్ పద్మ, బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



గుంటూరు సుందరయ్య నగర్‌లో..

## కమిషనర్ ఆదేశాలు అమలు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-గుంటూరు

ఇన్‌చార్జి ఎంఇఒల నియామకంలో పాఠశాల విద్య కమిషనర్ ఉత్తర్వులను అమలు చేయకుంటే ప్రత్యక్ష ఆందోళన చేపడతామని యుటిఎఫ్ నాయకులు అన్నారు. ఈ మేరకు వివిధ సమస్యలపై యుటిఎఫ్ నాయకులు గురువారం డిఇఒ సి.వి.రేణుకకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్ మాట్లాడుతూ తుళ్లూరు ఎంఇఒగా నియమితులైన ఎన్.అజయ్‌కుమార్‌కు ఎఫ్ఎసి బాధ్యతలు అప్పగించాలని కోరారు. ఎంఇఒ-1, ఎంఇఒ-2 పోస్టులకు పూర్తి అదనపు బాధ్యల కేటాయిపు ఉత్తర్వులలో ఒక విధానం అంటూ లేదన్నారు. ఎవర్ని, ఎందుకు మారుస్తున్నారో అర్థం కావట్లేదన్నారు. ఉపాధ్యాయుల డిప్యూటేషన్ల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. కొందరిపట్ల కఠినంగా, కొందరి పట్ల ఉదాసీనంగా ఉండటం సరికాదన్నారు. ఉపాధ్యాయుల జీతాల బిల్లులు ఎంఆర్‌సి సిబ్బంది మాత్రమే చేయాలని, ఇందుకోసం ఉపాధ్యాయుల్ని వినియోగిస్తున్న ఎంఇఒలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోని ఎడల ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శులు సిహెచ్. ఆదినారాయణ, జి.వెంకటేశ్వరరావు, ఎం.గోవిం దయ్య, ఎం.డి.షకీలాబేగం, ఎ.శ్రీనివాస రావు, కె.కేదార్‌నాథ్ పాల్గొన్నారు.


డిఇఒకు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు


ఉట్టి వేడుకల్లో పాల్గొన్న విద్యార్థినుల

## బిహెచ్ కాలేజీలో ముందస్తు కృష్ణాష్టమి

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక బ్రాడీపేటలోని బండ్లమూడి హనుమాయమ్మ డిగ్రీ కాలేజిలో గురువారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. కృష్ణ చరితను విద్యార్థినులు నృత్యనాటికగా ప్రదర్శించారు. కోలాటం, ఉట్టికొట్టే వేడుకలు ఉల్లాసంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షులు డాక్టర్ బి.వి.విజయ్‌భాస్కర్, కార్యదర్శి చేగుశ్రీధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కౌశల్యాదేవి, వైస్ ప్రిన్సిపాల్ రాధామాధవి, అధ్యాపకులు పాల్గొన్నారు